# విశాఖలో విద్యార్థులకు పోష్, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు



**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**

విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వి.సి.ఎస్.సి) ఆధ్వర్యంలో పీఎం పాలెంలోని శ్రీనివాసరావు ఫార్మసీ కళాశాలలో బుధవారం రెండు ముఖ్యమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మొదటిగా కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ (పోష్) అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో వి.సి.ఎస్.సి అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రి పోష్ చట్టం ప్రాముఖ్యత, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ) బాధ్యతలు, మహిళలకు సురక్షిత వాతావరణం అవసరం వంటి అంశాలను వివరించారు. లక్ష్మీ ముక్కవిల్లి మహిళల భద్రతకు సంబంధించిన కీలక సూచనలు తెలియజేశారు. తదుపరి సైబర్ భద్రత అవగాహనపై జరిగిన కార్యక్రమంలో వి.సి.ఎస్.సి జాయింట్ సెక్రటరీ కిశోర్ దాసరి ఆన్‌లైన్ మోసాలు, నకిలీ రుణ యాప్‌లు, మ్యూల్ ఖాతాలు, అసురక్షిత ఇంటర్నెట్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాగ్రత్తలు పాటించడం, బాధ్యతాయుత డిజిటల్ ప్రవర్తన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన కళాశాల డైరెక్టర్ వంగా శివరామ అల్వార్దాస్‌కు వి.సి.ఎస్.సి కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమాల సమన్వయంలో ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ జగ్గుమంత్రి, వాలంటీర్ కళ్యాణ్ సహకరించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు చురుకుగా పాల్గొనడం విశేషం.



విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త

## జిల్లాలో విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు

**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**




విశాఖపట్నం జిల్లాలో విద్యాసంస్థల బస్సులపై కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఏప్రిల్ 28 నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,250 బస్సులలో 368 బస్సులను తనిఖీ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీలలో 76 బస్సులు నిర్దేశిత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లు గుర్తించామన్నారు. సంబంధిత విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేసి, లోపాలను వారం రోజుల్లో సరిచేసుకొని, సంబంధిత ఎంవీఐ/ఏఎంవీఐ సమక్షంలో డీటీసీ కార్యాలయంలో వాహనాలను సమర్పించాలని ఆదేశించామని చెప్పారు. భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటన ద్వారా హెచ్చరించారు.

## నార్కోటిక్ డాగ్ సహాయంతో 3.5 కేజీల గంజాయి పట్టివేత

**విశాఖపట్నం, మే 6 ప్రభాతవార్త**



నార్కోటిక్ డాగ్ సహాయంతో 3.5 కేజీల గంజాయి పట్టుకున్నారు. డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., కమిషనర్ ఆఫ్ పోలీస్ , అదనపు జిల్లా మెజిస్ట్రేట్ గారి ఆదేశాల మేరకు, ఆర్.ఐ (సెక్యూరిటీ వింగ్) గారి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందాలు వివిధ ప్రాంతాల్లో నిత్య తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో మర్రిపాలెం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్ సహాయంతో 3.5 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితుడు దొరకని కారణంగా గంజాయిని తదుపరి చర్యల కోసం ఎయిర్ పోర్ట్ పోలీసులకు అప్పగించారు. గంజాయి గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన నార్కోటిక్ డాగ్ విశ్వ, డాగ్ హ్యాండ్లర్ పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

## ప్రయాణికులకు ఊరట - విశాఖ-కొల్లం రైలు రెగ్యులర్ సేవలు

**విశాఖపట్నం, మే 8, ప్రభాతవార్త:**

విశాఖపట్నం-కొల్లం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును వారానికి ఒకసారి నడిచే సాధారణ ఎక్స్‌ప్రెస్ రైలుగా మారుస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 08539/08540 ప్రత్యేక రైలు సంఖ్యలను 18501/18502గా మార్చి మే 12, 2026 నుంచి అమల్లోకి తీసుకు వస్తున్నారు. 18501 నంబర్ రైలు ప్రతి మంగళవారం ఉదయం 8:20 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి, అదే రోజు 8:45 గంటలకు దువ్వాడ చేరుకుని 8:47కు బయలుదేరుతుంది. అనంతరం బుధవారం మధ్యాహ్నం 2:50 గంటలకు కొల్లం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 18502 నంబర్ రైలు ప్రతి బుధవారం సాయంత్రం 5:20 గంటలకు కొల్లం నుంచి బయలుదేరి, గురువారం రాత్రి 9:40 గంటలకు దువ్వాడ చేరుకుని 9:42కు బయలుదేరి, రాత్రి 11 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పోదనూరు, పాలక్కాడ్, త్రిశూర్, అలువా, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, తిరువల్ల, చెంగన్నూరు, కాయంకుళం తదితర స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైలులో మొత్తం 18 బోగీలు ఉండగా, 2వ ఏసీ - 1, 3వ ఏసీ - 1, 3వ ఏసీ ఎకానమీ - 4, స్లీపర్ - 6, జనరల్ - 4, దివ్యాంగులకు అనుకూల బోగీ - 1, లగేజ్‌జనరేటర్ వాన్ - 1 ఉంటాయి. ప్రయాణికులు ఈ సేవలను వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరుతున్నారు.

## విశాఖ రైల్వే జోన్ కల సాకారం

### - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్

**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**



విశాఖపట్నం రైల్వే జోన్‌పై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గజిట్‌ను స్వాగతిస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం ఇక్కడ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ అంశాలు ప్రస్తావించబడినా, వాటి సాధనకు దీర్ఘకాలంగా చేసిన కృషి ఫలించిందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేరిందని పేర్కొంటూ, సోము వీర్రాజు, పురందేశ్వరి తదితర బీజేపీ నాయకులతో కలిసి కేంద్రాన్ని ఒప్పించి ఈ జోన్ సాధించగలిగామని చెప్పారు. రైల్వే జోన్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని చట్టంలో లేకపోయినా, పరిశీలనలో భాగంగా దీన్ని అమలు చేయడం సాధ్యమైందని వివరించారు. తాను యువ నాయకుడిగా ఉన్నప్పటి నుంచే విశాఖ రైల్వే జోన్ కోసం పోరాటం చేసినట్లు, అప్పట్లో వివక్షతకు వ్యతిరేకంగా కేసులు కూడా వేశామని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు, వెంకయ్యనాయుడు తదితరులు కూడా జోన్ ఏర్పాటుకు కృషి చేసినట్లు గుర్తుచేశారు. 2019లో జోన్ ప్రకటించబడగా, అనేక సంవత్సరాల కృషి ఫలితంగా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. రైల్వే జోన్ కార్యాలయం కోసం విశాఖలో 52.25 ఎకరాలు కేటాయించగా, ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం రాగానే కొత్త వలస కీలక స్టేషన్‌గా మారుతుందని, రాష్ట్రంలో 87 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో హింస లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావం, శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు నెరవేరుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు మాధవ్ ధన్యవాదాలు తెలిపారు.

## సీఎస్ఆర్ అవార్డుల్లో వరుసగా

# రెండోసారి విశాఖపట్నం పోర్ట్ డబుల్ గోల్డ్

**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**



విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సిగలో మరో కలికితురాయి చేరింది. ప్రతిష్ఠాత్మకమైన గ్రీన్‌టెక్ సీఎస్ఆర్ అవార్డ్స్ 2026లో పోర్ట్ రెండు విభాగాల్లో గోల్డ్ అవార్డులు గెలుచుకుంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో హెల్త్‌కేర్ ప్రమోషన్ మరియు స్కిల్ డెవలప్ మెంట్ విభాగాల్లో వరుసగా రెండో ఏడాది విశాఖపట్నం పోర్ట్ ఈ ఘనతని సాధించడం విశేషం. విజేతల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన న్యాయనిర్ణేతల మండలి ముందు పోర్ట్ నిర్వహించిన వర్చువల్ ప్రెజెంటేషన్ మరియు ప్రశ్నోత్తరాల్లో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా విజేతను ఎంపిక చేశారు. ప్రతి సంవత్సరం ప్రదానం చేసే గ్రీన్‌టెక్ సీఎస్ఆర్ అవార్డులు, కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా అత్యుత్తమ సేవలు అందిస్తున్న సంస్థలను గుర్తించి సత్కరిస్తాయి. హెల్త్‌కేర్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో పోర్ట్ చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు ఈ అవార్డులు లభించాయి. హెల్త్‌కేర్ ప్రమోషన్ కార్యక్రమాలుహెల్త్‌కేర్ విభాగంలో పోర్ట్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది:.. అనాథ అన్‌ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిధులు .. వివిధ ప్రాంతాల్లో మూడు నీటి శుద్ధి యంత్రాల ఏర్పాటు ..ఀఆరోగ్యం" ప్రివెంటివ్ హెల్త్ మరియు సేఫ్ డ్రింకింగ్ వాటర్ ఏటీఎం యూనిట్ల స్థాప న.. ట్రాఫిక్ సిబ్బందికి 100 ఎయిర్ కండిషన్డ్ హెల్మెట్ల పంపిణీ .. హార్బర్ ప్రాంతంలో భద్రత పెంపు కోసం రెండు డ్రోన్ సర్వైలెన్స్ వ్యవస్థల వినియోగం .. క్వీన్ మేరీస్ గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ .. వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీకి మద్దతుస్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలుస్కిల్ డెవలప్‌మెంట్ విభాగంలో పోర్ట్ చేపట్టిన కార్యక్రమాలు ప్రశంసలు పొందాయి:.. మహిళల సాధికారత కోసం కుట్టు యంత్రాల పంపిణీ .. అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్య శిక్ష ణ.. పేద మరియు అవసరమైన హాస్టల్ విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణకు ఆర్థిక సహాయం .. మత్స్యకార మహిళల సాధికారతకు ప్రత్యేక కార్యక్రమాలుఈ అవార్డులు సీఎస్ఆర్ కార్యక్రమాలపై విశాఖపట్నం పోర్ట్ కు ఉన్న నిబద్ధతను, సమాజ అభివృద్ధికి పోర్ట్ తీసుకుంటున్న వ్యూహాత్మక చర్యలను ప్రతిబింబిస్తున్నాయి. పోర్ట్ సాధించిన ఈ ఘన విజయంపై సిబ్బందిని అభినందిస్తూ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమా లను మరింత విస్తరించాలని పోర్ట్ చైర్ పర్సన్ డా. ఎం. అంగ ముత్తు, ఐఏఎస్ సూచించారు. ఈ విజయాన్ని కారకులైన సిబ్బందిని డిప్యూటీ చైర్‌పర్సన్ శ్రీమతి రోష్ని అపరాంజి కొరాటి, ఐఏఎస్ అభినందించారు. ఈ అవార్డులు 2026 మే 12-13 తేదీల్లో న్యూఢిల్లీ లో జరగనున్న గ్రీన్‌టెక్ సీఎస్ఆర్ సమ్మిట్‌లో ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని పోర్ట్ కార్యదర్శి శ్రీ ఎం. శంకర్ బాబు మీడియాకు వెల్లడించారు.

## జలధారతో రాంపురం జెమ్మివాని చెరువుకు పూర్వవైభవం..

*- 50 ఎకరాల విస్తీర్ణంలోని చెరువుకు రూ.19.73 లక్షల అంచనా వ్యయంతో పునరుద్ధరణ చర్యలు..*

*- 165 ఎకరాల ఆయకట్టులో వరి, అపరాల సాగుకు ఊతం..*

*- 300 రైతు కుటుంబాలకు ప్రయోజనం*

**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధారజలహారతి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పెందుర్తి మండలం రాంపురం జెమ్మివాని చెరువుకు పూర్వ వైభవం రానుంది. పెందుర్తి, రాంపురం గ్రామాల్లోని 165 పైచిలుకు ఎకరాల ఆయకట్టుకు ప్రధాన ఆధారమైన ఈ చెరువు పునరుద్ధరణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. సుమారు రూ.19.73 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక్కడ నీటి మట్టం 6 మీటర్ల కంటే తక్కువ ఉండటంతో దాన్ని 3 మీటర్లకు తీసుకొచ్చేందుకు చర్యలు మొదలు పెట్టింది. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి కూలీల సాయంతో సంబంధిత విభాగాల అధికారులు పనులు మొదలు పెట్టి కొనసాగిస్తున్నారు. పునరుద్ధరణ పనుల్లో రోజుకు సుమారు 160 నుంచి 200 వరకు ఉపాధి కూలీలు భాగస్వామ్యం అవుతున్నారు.



డ్వామా, ఇరిగేషన్ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.165 ఎకరాల ఆయకట్టు.. 300 రైతు కుటుంబాలకు ప్రయోజనంచురుగ్గా పునరుద్దరణ పనులు జరుగుతున్న రాంపురం చెరువు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే పెందుర్తి, రాంపురం గ్రామాల్లోని సుమారు 165 ఎకరాలకు ఆయకట్టు లభిస్తుంది. 305 రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది. 3500 మంది ప్రజలు ప్రత్యక్ష, పరోక్షంగా ప్రయోజనం పొందుతారు. ప్రధాన పంట వరి కాగా, అపరాల సాగుకు కూడా ఈ జెమ్మి వాని చెరువు ఊతం కానుంది. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అప్పట్లో ఈ చెరువు కింద ఆయకట్టు భూములకు నిత్యం నీరు లభించేదని, ఇప్పుడు ఈ పునరుద్ధరణ పనులతో మరళా పూర్వ రోజుల తిరిగొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జలధారజలహా రతి పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం వల్ల చెరువు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్‌పెందుర్తి మండలం, రాంపురంలో జలధార జలహారతి కింద చేపట్టిన జెమ్మివానిచెరువు అభివృద్ధి పనులను జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి బుధవారం పరిశీలించారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అందరూ సమన్వయం వహించి పనులను ప్రణాళికాయుతంగా చేయాలని చెప్పారు. ఆమెతో పాటు డ్వామా పీడీ నిర్మలాదేవి, ఏపీడీ ఆంజనేయులు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు ఉన్నారు.

## వియంఆర్‌డిఏ అడుగులు.. గ్రామీణ ప్రాంతాలు పట్టణీకరణ వైపు

**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**

వియంఆర్‌డిఏ సమావేశమందిరంలో బుధవారం చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అధ్యక్షతన జరిగిన అథారిటీ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. వియంఆర్‌డిఏ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి సమావేశంలో కూలంకుషంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాలను పట్టణీకరణ దశగా అభివృద్ధి చేసేందుకు పలు అభివృద్ధిపనులను చేపట్టే దిశగా వియంఆర్‌డిఏ చర్యలు



తీసుకుంటుందని పేర్కొన్నారు. బిజులీది పరిధి దాటి వియంఆర్‌డిఏ పరిధిలో ఉన్న ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, నర్సీపట్నం, విజయనగరం, చీపురుపల్లి, నెల్లిమర్ల, పాయకరావు పేట తదితర మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పించేందుకు ముఖ్యంగా కాలువలు, రహదార్లు, పార్క్ ల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గాజువాక లో స్పోర్ట్స్ విలేజ్ నిర్మాణానికి సుమారు రూ.9 కోట్లని కేటాయిస్తున్నారని వివరించారు. అదేవిధంగా ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు విశాఖ ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు తీసుకున్న నిర్ణయాలను వివరించారు. కైలాసగిరి పై త్రిశూల్ ను ఈ నెల 9 తేదీన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దారితీసే ప్రధాన రహదారుల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, అలానే ఆయా రహదారుల్లో డెకరేటివ్ విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రహదారి మధ్యలో పచ్చదనం పెంపొందించటం, అవసరమైన ప్రాంతాల్లో కాలువలు నిర్మాణం కోసం నిధులు కేటాయించామని వివరించారు. సెంట్రల్ పార్క్ ఆవరణలో యువగళం యాంటీ డ్రగ్ పార్క్ నిర్మాణం 3 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేశామని వివరించారు. జులీళిదీతి చెందిన అన్ని భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ జులీళిదీతి ఇటీవల కొత్తగా రూపొంచించిన విస్టా యాప్ వినియోగంతో ఆదాయం గణనీయంగా వృద్ధిచెందిందన్నారు. అనకాపల్లి, విజయనగరం లలో ఉన్న జోనల్ ఆఫీసుల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యకలాపాలను అతిత్వరలో పూర్తి స్థాయిలో చేపడతామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ళీ సురేష్ కుమార్, ,తిళీ., విశాఖపట్నం కలెక్టర్ శ్రీ అభిషిక్త్ కిషోర్, బిజులీది కమీషనర్ శ్రీ కేతన్ గార్గ్, ,తిళీ., తిశినిశిదీ దిలి దిలీదీ పృధ్వీ తేజ్, ,తిళీ., అనకాపల్లి జాయింట్ కలెక్టర్ వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజనీర్ శ్రీ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ శ్రీ మధుసూదనరావు, కార్యదర్శి శ్రీ మురళీకృష్ణ, ప్రధాన గణాంకాధికారి శ్రీ హరిప్రసాద్ దీనీవీ శ్రీమతి శిరీష పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే పీలా వ్యవహార శైలిపై తమ్ముళ్ల అసంతృప్తి!

**- టీడీపీ జిల్లా అధ్యక్షులు తాతయ్య బాబుకు ఫిర్యాదు - ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్**

**ప్రభాతవార్త, అనకాపల్లి**

అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారా యణ వ్యవహార శైలిపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆయనను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ నాయకులు తిరుగుబాటు స్వరం వినిపిస్తున్నారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న అసంతృప్తి ఇటీవల మరింత బహిర్గతమైంది. ఇటీవల కొణతాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అసమ్మతి సమావేశంలో పీలా గోవిందను ఇన్‌చార్జి పదవి నుంచి తప్పించాలని కోరుతూ పార్టీ అధినేతకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే నేపథ్యంలో గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తాతయ్య బాబును పలువురు సీనియర్ నాయకులు కలిసి పీలా గోవిందపై పలు ఆరోపణలు చేస్తూ వినతి పత్రం సమర్పించారు. దీంతో పార్టీ అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కార్యకర్తలను గౌరవించాలని సూచిస్తున్నప్పటికీ, అనకాపల్లి ఇన్‌చార్జి పీలా గోవింద భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ కార్యకర్తలను పక్కనబెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. అలాగే పార్టీ సమావేశాలు, సమాచారాన్ని కొంతమందికే పరిమితం చేస్తున్నారని, టౌన్ మరియు వార్డు కమిటీల కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. ఇటీవల నియమించిన పార్టీ కమిటీల్లో ఒకే కుటుంబాలకు చెందిన వారికి పదవులు ఇవ్వడం జరిగిందని ఉదాహరణలతో వివరించారు. ఈ విషయాలపై ప్రశ్నించిన సీనియర్ కార్యకర్తలను అవహేళన చేస్తున్నారని, కరోనా సమయంలో కూడా కార్యకర్తల పరిస్థితిని పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమాలకు సరైన పరిష్కారం ఉండడం లేదని తెలిపారు. గ్రూపు రాజకీయాలతో పార్టీ బలహీనపడుతోందని, అనకాపల్లి వంటి బలమైన నియోజకవర్గంలో పార్టీ స్థితి దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీని కాపాడాలంటే పీలా గోవిందను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని, ఈ విషయాన్ని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ ఫిర్యాదులో సీనియర్ నాయకులు బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, మల్ల శివన్నారాయణ, డీవీవీ అప్పారావు, విల్లూరి రమణ బాబు, రామోజు శ్యాంసుందర్, కోట్ని రాంబాబు, బుద్ధ భువనేశ్వర రావు, రామారావు, నర్సింగరావు, అప్పలనారాయణ పాల్గొన్నారు.

# కార్యకర్తలకు బలం.. అండ.. టీడీపీ పార్టీయే : కొప్పిశెట్టి



**నక్కపల్లి, ప్రభాతవార్త**

ఈ రాష్ట్రంలో కార్యకర్తలకు కొండంత అండ తెలుగుదేశం సభ్యత్వం పొందడమేనని అందుకే ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న ఆదరణ చూసి బ్రతికితే పార్టీ కోసం బ్రతకాలని ప్రతి కార్యకర్త ఆలోచిస్తున్నారని అందుకే ఏ పార్టీకి లేనంత సభ్యత్వం తెలుగుదేశం పార్టీకి ఉందని టిడిపి పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని దేవవరం శివారు వడ్డీ మెట్ట గ్రామానికి చెందిన పెట్ల గణపతికి పార్టీ అందజేసిన ఇన్సూరెన్స్ 500000 చెక్కును మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు వెంకటేష్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా గణపతి వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొంది ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారని, ఇది చాలా బాధాకరమైన విషయం అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం పనిచేసిన కార్యకర్తని, వెంకటేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉండటమే ఒక అదృష్టమని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎన్నడు అండగా ఉంటాదని అన్నారు ప్రధానంగా పాయకరావుపేట నియోజకవర్గంలో కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధి ఏ లక్ష్యంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పనిచేస్తున్నారని అన్నారు. అటువంటి నాయకురాలికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యా మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహం మరింతగా నియోజకవర్గానికి ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క టీడీపీ కార్యకర్తకు ఏ చిన్న నష్టం జరిగిన పార్టీ అండగా ఉంటాదని ఏ ఒక్కరు అధైర్య పడాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రాణం చాలా విలువైనదని ప్రతి ఒక్కరు ఆరోగ్య విషయంలో భద్రత పాటించాలని కోరారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ముందు ఆలోచనతో కార్యకర్త కుటుంబానికి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. ఇటువంటి బృహత్తరమైన కార్యక్రమం భారతదేశంలో ఏ పార్టీకి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెట్ల చిరంజీవితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

# మాధవధార చుట్టూ పక్కల ప్రాంతాలలో రేపు పవర్ కట్

**మాధవధార, మే 06, ప్రభాతవార్త**

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్ లో రాజీవ్ నగర్,మాధవధార -2 ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు,విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్ -2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బికె నాయుడు బుధవారం తెలిపారు. దీంతో సీతాన్న గార్డెన్స్, ఈస్ట్ పార్క్ బ్యాక్ సైడ్, ఉడా కాలనీ, కళింగ నగర్,గాంధీ నగర్, రామన్న కాలనీ, చిట్టిబాబు కాలనీ, అప్పయ్య నగర్, రాజీవ్ నగర్, వంశీ నగర్‌లో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# సామాజిక సేవలో శ్రీజ హెల్పింగ్ హ్యాండ్స్

**గాజువాక, మే 06,ప్రభాతవార్త**



శ్రీజ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం గాజువాక బీసీ రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కొయిలాడ శ్రీనివాసరావు, సరస్వతి దంపతులు ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూర్యమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదానం, విద్యా, వైద్య, జంతు సేవా కార్యక్రమాలు అభినందనీయమని వారు కొనియాడారు. వేసవి ఎండల దృష్ట్యా బాటసారులకు, వాహన చోదకులకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేశారు.

# వేసవి కాలంలో చర్మ రక్షణ, జాగ్రత్తలు అవసరం

## గీతం ఆసుపత్రి వైద్యురాలు డా.ఫర్జానా



**విశాఖపట్నం, మే 06,ప్రభాతవార్త**

వేసవి కాలంలో చర్మ రక్షణ, జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్సర్) ఆసుపత్రి డెర్మటాలజీ విభాగం నగర ప్రజలకు పలు సూచనలు చేసింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా చర్మంపై పడే ప్రతి కూల ప్రభావాలను అరికట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గీతం మెడికల్ కాలేజ్ (జిమ్సర్) ప్రొఫెసర్ డా.ఫర్జానా సూచించారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక వేసవి చిట్కాలను వివరించారు. వేసవిలో ముఖంపై పేరుకుపోయిన చెమట జిడ్డును తొలిగించు కోవడానికి రోజుకు రెండు మూడు సార్లు మైల్డ్ క్లిన్సర్‌తో శుభ్రం చేసుకోవాలని అయితే అతిగా కడగడం వల్ల చర్మం సహజత్వాన్ని కోల్పోతుందని ఆమె హెచ్చరించారు. వేసవిలో శరీరానికి భారీ క్రీములకు వాడటానికి బదులుగా జిడ్డు లేని ఆధారిత మాయిశ్చరైజర్లను వాడటం ఉత్తమమని అలాగే ఎండ నుండి రక్షణ పొందడానికి గొడుగులు, టోపీలు, సన్‌గ్లాసెస్, వదులైన కాటన్ దుస్తులను ధరించాలన్నారు. సన్‌స్క్రీన్ వాడకం విషయంలో అశ్రద్ధ వద్దు అని చెబుతూ ఇంట్లో ఉన్నప్పటికీ ఎస్‌పిఎఫ్ 30 కలిగిన బ్రాండ్ స్పెక్ట్రమ్ సన్‌స్క్రీన్‌ను రాసుకోవాలని, ప్రతి 3-4 గంటలకు ఒకసారి దానిని మళ్ళీ అప్లై చేయాలని డాక్టర్ ఫర్జానా స్పష్టం చేశారు. శరీరంపై గల చర్మ రంధ్రాలు ముసుకుపోయి మొటిమలు రాకుండా ఉండాలంటే తక్కువ మేకప్ వేసుకోవాలని, నాన్ కామెడోజెనిక్ ఉత్పత్తులనే వాడాలని సూచించారు. వేసవిలో వచ్చే ఫంగల్ ఇన్ఫెక్షన్లు మరియు సెగ్గడ్డల పట్ల జాగ్రత్తగా ఉండాలని, క్రమం తప్పకుండా స్నానం చేస్తూ చెమట పట్టిన బట్టలను వెంటనే మార్చుకోవాలని ఆమె హితవు పలికారు. చర్మ సమస్యలు తీవ్రంగా ఉంటే వెంటనే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలని తెలిపారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం ద్వారా చర్మ క్యాన్సర్, వృద్ధాప్య ఛాయలు మరియు టానింగ్ నుండి తప్పించుకోవచ్చునని వివరించారు. కేవలం బాహ్య రక్షణే కాకుండా లోపల నుండి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి రోజుకు కనీసం 8 గ్లాసుల మంచి నీరు తాగుతూ యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే కాలానుగుణంగా లభించే పండ్లు, కూరగాయలను ఆహారంలో బాగం చేసుకోవాలని డాక్టర్ ఫర్జానా ప్రజలకు సూచించారు.

# అజీమాబాద్‌లో రూ.20 లక్షలతో సిసి రోడ్డు పనులు

## పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రఫీ

**గాజువాక, మే 06,ప్రభాతవార్త**



గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 66వ వార్డు అజీమాబాదులో రూ. 20 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు పనులను బుధవారం వార్డు ఇంచార్జ్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పర్యవేక్షించారు. పనులను దగ్గరుండి పరిశీలించిన ఆయన, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సికిందర్, హుస్సేన్, వలీల్ ఖాన్, కాసిం, కిషోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు



**మాధవధార, మే 06, ప్రభాతవార్త**

విశాఖలో విద్యాసంస్థల బస్సులపై కొన సాగుతున్న ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఏప్రిల్ 28 నుంచి బుధవారం 1,250 బస్సులలో 368 బస్సులను తనిఖీ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీలలో 76 బస్సులు నిర్దేశిత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లు గుర్తించామన్నారు. సంబంధిత విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేసి, లోపాలను వారం రోజుల్లో సరిచేసుకొని, సంబంధిత ఎంవీఐ/ఏఎంవీఐ సమక్షంలో డీటీసీ కార్యాలయంలో వాహనాలను సమర్పించాలని ఆదేశించామని చెప్పారు. భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు



**పద్మనాభం,మే 6,ప్రభాతవార్త**

మండలంలో గెద్దపేట గ్రామంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠమహోత్సవాలను బుధవారం ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దీంతో గత మూడు రోజుల నుండి జరుగుతున్న ఈ ఉత్సవాలతో పాటు ఆలయ అష్టమి వార్షికోత్సవాలు కూడా నేటితో ఘనంగా ముగిసాయి. అయితే ఉదయం అర్చకులు సంతోషకుమార్ బృందం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాదన అనంతరం ముహూర్తం ప్రకారం పది గంటలకు ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమంను పూర్ణచంద్రరావు దంపతులతో చేయించారు. తరువాత స్వామివారికి ప్రత్యేకపూజలు చేసారు. ఈ సందర్భంగా బారీ అన్నసమారాధన నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షులు రమణ, నాయకులు దాము, విజయబాబు, ప్రసాదు,కోంద్రోతు శ్రీను, సూరినాయుడు పూజలు చేసారు. గెద్ద ఎర్రినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

# మినీ బస్సును ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



**ఆనందపురం, మే 6, ప్రభాతవార్త**

ఆనందపురం మండలంలోని భీమిలి క్రాస్‌రోడ్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆనందపురం నుంచి భీమిలి వెళ్తున్న మినీ బస్సు భీమిలి క్రాస్ రోడ్డు వద్ద భీమిలి వైపు మలుపు తిరుగుతున్న సమయంలో, అదే దిశలో వెనుక నుంచి వేగంగా వస్తున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇబ్రహీం (35) తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం ప్రభావంతో అతని దవడ, పెదవుల వద్ద తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌కు సమాచారం అందించగా క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. మినీ బస్సు డ్రైవర్ మారికవలస గ్రామానికి చెందిన గుండు రమణ (45) ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాదంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ ట్రాఫిక్‌కు అంతరాయం కలగలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తుంగ్లంలో నేటి నుంచి విజయ రాఘవస్వామి కుంభమేళా మహోత్సవాలు

**గాజువాక,మే 06,ప్రభాతవార్త**



జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లం గ్రామంలో వెలసిన శ్రీ విజయ రాఘవస్వామి వారి ఆలయం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. మే 7 నుంచి ఈనెల 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న 'శ్రీ విజయ రాఘవస్వామి వారి పుష్కర పట్టాభిషేక కుంభమేళా మహోత్సవాల' కోసం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

## వారం రోజుల పాటు విశేష పూజలు

ఈ మహోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు స్వామివారికి శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు, యాగాలు, హోమాలు నిర్వహించనున్నారు. ఉదయం నుండే వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పట్టాభిషేక కుంభమేళా మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొందాలని తుంగ్లం గ్రామాభివృద్ధి యువజన సేవా సంఘం ప్రతినిధులు కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు



**ఆరిలోవ, మే 6, ప్రభాతవార్త**

చినగదిలి శ్రీ నార్త్ శిరిడి సాయి బాబా వారి ఆలయంలో ఉన్న శ్రీ అంబికా సమేత శ్రీ మృత్యు జయ స్వామి వారి శ్రీ రమ సహిత సత్యనారాయణ స్వామి వారి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి పంచమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం గణపతి పూజ పుణ్యాహవచనం మండపరదన మహా రుద్ర అభిషేకం సత్యనారాయణ వ్రతం విశ్వకర్మ వ్రతం ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఆలయ అర్చకులు నగేష్ శర్మ, ప్రభాస్ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ శ్రీ వానపల్లి అప్పారావు, ఆలయ సెక్రటరీ ఆర్‌ఏ పాత్రో, సబ్ ట్రెజరర్ వానపల్లి మంగరాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ త్రిశక్తి అమ్మవార్ల ధ్వజస్తంభ శంకుస్థాపన

## పాల్గొన్న వైకాపా గాజువాక ఇంచార్జ్ దేవన్ రెడ్డి -భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ

**గాజువాక, మే 6, ప్రభాతవార్త**



గాజువాక నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 87వ వార్డు, లక్ష్మీపురం కాలనీలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కాలనీలోని శ్రీ శ్రీ శ్రీ త్రిశక్తి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో బుధవారం ధ్వజస్తంభ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ విశేష పూజా కార్యక్రమానికి గాజువాక వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. అనంతరం దేవన్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆలయాల అభివృద్ధికి భక్తుల సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. 87వ వార్డు పార్టీ అధ్యక్షులు బొడ్డ గోవింద్, గాజువాక బీసీ సెల్ అధ్యక్షులు చిత్రడ వెంకటరమణ, 76వ వార్డు పరిశీలకులు ముద్దపు దామోదరరావు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు సూర్యనారాయణ, కనకరావు, బాబూరావు, అప్పలరాజు, ప్రసాద్, అంజయ్య భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శంకుస్థాపన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# మద్దిగ్రామంలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ



**పద్మనాభం, మే 6, ప్రభాతవార్త**

మండలంలో మద్దిగ్రామంలో బుధవారం తహాశీల్దారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మీ భూమి మీహక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను టీడీపీ నాయకులు అందజేసారు. 720 మంది రైతులకు పాస్ పుస్తకాలను మండల టీడీపీ అధ్యక్షులు కె.రమణ, నాయకులు దామోదరరావు, విజయబాబు, నగేష అందజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సన్నిబాబు, సన్యాసినాయుడు, నీటి సంఘ అధ్యక్షుడు గిరి, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.

# భీశెట్టి బాబ్జి లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు

**విశాఖపట్నం, మే 6 ప్రభాతవార్త**




విశాఖ కేంద్రం గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ 1 నుండి ప్రారంభం అవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చెయ్యడంతో రాష్ట్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు బుధవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఉశోదయ జంక్షన్ లోక్ సత్తా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని కీలకమైన అంశాలు వెంటనేఅమలు చెయ్యాలని ముఖ్యంగా రైల్వే జోన్‌పై కేంద్ర ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఉత్తరాంధ్ర చర్చావేదిక అధ్యక్షులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో లోక్ సత్తా, వామపక్షాలు, ప్రజా సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేశామని రెండు సార్లు ఢిల్లీ వెళ్లి అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలను కలిసి వత్తిడి తెచ్చామని భీశెట్టి తెలిపారు జోన్ స్వప్న సాకారం ఆనందంగా ఉన్నప్పటికీ కొత్తవలస అరకు సెక్షన్ 105 కిలోమీటర్లు రైల్వే శాఖ రాయగడ డివిజన్‌కి కేటాయించడంపై అసంతృప్తి ఉందని మన పార్లమెంట్ సభ్యులు దీనిపై వత్తిడి తేవాలని అప్పుడే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పూర్తిగా జరిగినట్టు ఉంటుందని రైల్వే హబ్‌గా విశాఖపట్నం రాష్ట్ర అభివృద్ధికి దోహదం పడుతుందని భీశెట్టి ఆశభావం వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం మిగిలిన విభజన హామీలను నెరవేర్చడానికి కృషి చెయ్యాలని రాష్ట్ర ప్రజల అవసరాల మేరకు రైళ్లు, లైన్లు, రైల్వే బోర్డుని ఏర్పాటు చెయ్యాలని కోరారు. లోక్ సత్తా నగర అధ్యక్షులు ఎమ్.ఎస్. ఎన్.మూర్తి, మద్రాపు సుదీర్, ఇప్పలవలస గోపి, పక్కి శంకర్, మహిళా సత్తా నాయకురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.




# ప్రతిభా పోస్టర్ ఆవిష్కరణ

**ఆనందపురం, మే 6, ప్రభాతవార్త**

ఆనందపురం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల విజయాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో రూపొందించిన ప్రతిభా పోస్టర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల ప్రతినిధి వి.జాన్‌పాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. మొత్తం ఏడుగురు విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించగా, 41 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు, 110 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే 133 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

# బాల్యం కేంద్రాల్లో ఉచిత విద్యకు అడ్మిషన్లు ప్రారంభం

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**



మహా విశాఖ నగరంలోని బాల్యం విద్యా కేంద్రాల్లో 3 నుంచి 5 సంవత్సరాల చిన్నారులకు ఉచిత పూర్వ ప్రాథమిక విద్య కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను బాల్యం కేంద్రాల్లో చేర్పించి ఈ అవకాశాన్ని విని యోగించుకోవాలని ఆయన సూచించారు. బుధవారం జీవీఎంసీ కార్యాలయంలో 2026-27 విద్యా సంవత్స రానికి సంబంధించి అడ్మిషన్ల ప్రారంభానికి అవగాహన కల్పించే కరపత్రం, సోషల్ మీడియా పోస్టర్లను కమిషనర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాల్లో, ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల పిల్లలకు నాణ్యమైన ఉచిత పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు భరించలేని తల్లిదండ్రులు బాల్యం కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. బాల్యం కేంద్రాల్లో నమోదు శాతం పెంచేందుకు వేసవి సెలవుల్లో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా వినూత్న పద్ధతుల్లో బోధన చేపట్టాలని, తద్వారా వారు ప్రాథమిక విద్యకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. భవిష్యత్ పౌరులుగా తీర్చిదిద్దేలా విద్యాబోధన ఉండాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుపాటి మోహన్ కుమార్, బాల్యం కేంద్రాల అధ్యాపకులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# రెండు లారీలు సీజ్

**నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త**





అధికలోడుతో మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా ఫీజులను తప్పించుకునేందుకు అక్రమ రహదారుల్లో అధిక లోడుతో పయనిస్తున్న రెండు లారీలు నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం ఈ లోడుతో ఉన్న రెండు లారీలు, వేంపాడు నుంచి స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న రహదారిలో వెళుతుండగా పట్టుకోవడం జరిగిందని సీఐ మురళి తెలిపారు. పట్టుకున్న లారీలను సీజ్ చేసి తగు చర్య నిమిత్తం ఆర్టీవోకి పంపించడం జరిగిందని, పరిశీలించిన ఆర్టీవో రెండు వాహనాలకు అపరాధ లక్ష ఇరవై రెండు వేలు రుసుము విధించినట్లు తెలిపారు. ఈ రహదారుల్లో అధిక లోడు కలిగి ఎటువంటి వాహనాలు తిరిగిన వారి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ మురళి హెచ్చరించారు.

# విశాఖలో 65వ వార్షిక సమ్మర్ కోచింగ్ క్యాంపులు ప్రారంభం

## 28 క్రీడా విభాగాల్లో నెలపాటు శిక్షణ

**విశాఖపట్నం, మే 6, ప్రభాతవార్త**



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాలో 65వ వార్షిక సమ్మర్ కోచింగ్ క్యాంపులు ప్రారంభమయ్యాయి. మే 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 28 క్రీడా విభాగా ల్లో ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్యాంపుల ద్వారా 8 నుండి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను క్రీడల వైపు ఆకర్షించడం, చిన్న వయస్సులోనే ప్రతిభావంతులను గుర్తించడం, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అలాగే చిన్నారుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయడానికీ ఈ శిబిరాలు ఉపయోగపడనున్నాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు శిబిరాల నిర్వహణ కోసం క్యాంప్ ఇన్‌చార్జ్‌లకు క్రీడా సామ గ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులు మీడియాను కోరారు.


వార్త VAARTHA CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, VARALAKSHMI EDUBILLI W/O VINNAKOTI ASHOK KUMAR, previously called R/O 8-45-9/3, OLD CBI DOWN, CHINAWALTAIR,VISAKHAPATNAM, now changed my name from VINNAKOTI VARALAKSHMI to VARALAKSHMI EDUBILLI. Henceforth I will be called as VARALAKSHMI EDUBILLI for all purposes. (Ro.No. 4829)

★ I, DANDA SRIKANTH (OLD NAME) S/O DANDA NARASINGA RAO, R/O 8-42-32, TAMIL STREET, CHINAWALTAIR, VISAKHAPATNAM, I have changed my name as DANDA SREEKANTH (NEW NAME) hereafter my name is known as DANDA SREEKANTH (NEW NAME). (Ro.No. 4812)

★ I, TEEPARTHI VIJAYALAKSHMI W/O TEEPARTHI SRI RAMESH, previously called VIJAYALAXMI KALLA R/O 8-91, BODILINGAM STREET, RAYAVARAM, MACHAVARAM, EAST GODAVARI, now changed my name from VIJAYALAXMI KALLA to TEEPARTHI VIJAYALAKSHMI. Henceforth I will be called as TEEPARTHI VIJAYALAKSHMI for all purposes. (Ro.No. 4805)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



రిపోర్టర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. విశాఖలో వివిధ ప్రాంతాల్లో రిపోర్టర్లగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు కావలెను.

రిపోర్టర్లు కావలసిన ప్రాంతాలు

మునగపాక, రాంబిల్లి, పరవాడ, లంకెలపాలెం, ఉక్కునగరం, అక్కిరెడ్డిపాలెం, పెందుర్తి, భీమిలి, తాటిచెట్లపాలెం, వన్‌టౌన్, కలెక్టరేట్

అర్హులైన అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో 11-05-2026 సోమవారం ఉదయం 10గం.కు వార్త యూనిట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో హాజరుకాగలరు.

వార్త కార్యాలయం

జీవీఎంసీ ఎలిమెంటరీ స్కూలు ఎదురుగా, దుర్గా గణపతి గుడి వెనుక రోడ్డు, సీతమ్మపేట, విశాఖపట్నం, ఫోన్ నెం. 9848306312

vsp11:vsp11.qxd 06-05-2026 20:51 Page 1






## పీఎం జన్‌మన్ పనుల తనిఖీ



పాడేరు,మే 6, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పీఎం జన్మన్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పనులు ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మాట్లాడుతూ భూమి, స్థల సమస్యపై వివరాలు అడిగి తెలుసుకుని, గ్రామస్థులతో చర్చించారు. లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పీఎం జన్మన్ సైట్ ఏర్పాటుకు సంబంధించి తలెత్తిన సమస్యపై గ్రామస్థులతో ప్రాజెక్ట్ అధికారి ప్రత్యేకంగా సమావేశమ య్యారు. స్థానికుల వినతులను పరిగణనలోకి తీసుకున్న ఆయన, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. ప్రతిపాదిత సైట్ పక్కనే ఉన్న భూమికి సంబంధించిన పూర్తి వివరాలను రెండు రోజుల్లోగా నివేదించాలని స్థానిక తహశీల్దార్‌ను ఆదేశించారు. హాస్టల్ భవన నిర్మాణ పరిశీలన: అనంతరం లంబసింగిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ పీఎం జన్మన్ నిధులతో నిర్మిస్తున్న నూతన హాస్టల్ భవన పనులను పీఠ నిశితంగా పరిశీలించారు. నాణ్యతపై ఆదేశాలు,: హాస్టల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. గిరిజన విద్యార్థినులకు విద్య, వైద్యం, అలాగే మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఐటిడిఏ అధికారితో పాటు ఏపీ ఎస్ ఎస్ఏ అధికారి స్వామి నాయుడు ,రెవెన్యూ సిబ్బంది, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం : ఎస్ఐ




డుంబ్రిగూడ, మే 6 ప్రభాతవార్త: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తోనే సురక్షిత ప్రయాణం అని స్థానిక ఎస్సై సురేష్ చెప్పారు. మండలంలోని కించమండ వారపు సంతలో బుధవారం హెల్మెంట్ వినియోగం రోడ్డు భద్రతపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహన్న కలిగిన ప్రతి ఒక్క వ్యక్తి హెల్మెట్ ధరించి ప్రయాణించడం సురక్షిత ప్రయాణం అని వాటి యొక్క ప్రాముఖ్యతపై అవగాహన పరచడం జరుగుతుందని ఆయన తెలిపారు. బుధవారం సంతలోని సుమారు 100 బైక్లతో ర్యాలీ నిర్వహించి రోడ్డు భద్రతపై నియమాలు పాటించాలని రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యతని ఇటువంటి కార్యక్రమానికి వాహనదారులందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ డానియల్ మరణం తీరనిలోటు



పాడేరు,మే6, ప్రభాతవార్త: జి.మాడుగుల మండలం జోహర్లు గ్రామ నివాసి "పాస్టర్" డానియల్ మరణించడం వలన అల్లూరి జిల్లా పాస్టర్స్ ఫిలోసిప్ ఫౌండర్ డాక్టర్. టి. స్టీఫెన్ , యొక్క సూచన మేరకు. పాస్టర్ డానియల్,యొక్క జ్ఞాపకర్థ ప్రార్ధనకు హాజరై కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా పిలోషిప్ తరపున. ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఫెలోషిపు జనరల్ సెక్రెటరీ పాస్టర్ వి. మత్స్య రాజు, ట్రెజరర్. పాస్టర్ పి డేవిడ్ రాజు, జిల్లా నాయకులు పాస్టర్ జి. రాజేష్, పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య గెస్ట్ టీచర్లను రెన్యువల్ చేయాలి

పాడేరు,మే 6, ప్రభాతవార్త: అల్లూరి జిల్లాలోని 17 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్ టీచర్లను తొలగించేందుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేసిన ఐటిడిఏ పిఓ నిర్ణయాన్ని ఆదివాసీ గిరిజన సంఘం హర్షం వ్యక్తం చేస్తుందని జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నరస పేర్కొన్నారు. 2022 విధులు నిర్వహిస్తున్న వారిని అకారణంగా టెర్మినేషన్ చేస్తూ స్కూల్ ప్రిన్సిపల్స్ ఆదేశాలు జారీ చేయడం ఏకలవ్య మోడల్ స్కూల్ నిబంధనలకు విరుద్ధమైనది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన కొంతమంది ప్రిన్సిపల్స్ తమకు కావలసిన వారిని ఏకలవ్య విద్యా సంస్థలో నియమించుకోవడం కోసం స్థానికంగా గతం నుంచి విధులు నిర్వహిస్తున్న వారిని టెర్మినేషన్ చేయడం అన్యాయమనీ అంతేకాకుండా వారి స్థానాల్లో కొత్తవారిని నియమించడం కోసం నోటిఫికేషన్ జారీ చేయడం మరి దారుణం.. గతంలో ఈ అన్యాయమైన నోటిఫికేషన్‌పై తీవ్రంగా వ్యతిరేకత తెలియజేస్తూ పి. ఓ ఐ. టి. డి. ఏ వారికీ పిర్యాదు చేయడం జరిగింది. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచి ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల నిర్ణయాన్ని అమలు చేయడం ద్వారా 115 మంది గెస్ట్ ప్యాకల్టీ కి ఉపాధి లభించడం తోపాటు ఉద్యోగ భద్రత కల్గిందని అన్నారు. 2022నుండి విధులు నిర్వహిస్తున్న గెస్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ ను రెన్యూవల్ చేయాలాని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల విద్యార్థుల చదువు మరింత స్థిరంగా కొనసాగుతుందన్నారు. స్థానిక పరిస్థితులు, విద్యార్థులతో ఏర్పడిన బంధం, అనుభవం వంటి అమూల్యమైన అంశాలు కాపాడబడ్డాయి. విద్యార్థుల భవిష్యత్తుపై వచ్చిన అనవసర ఆందోళన తొలగించబడింది. ఇప్పటికీ ప్రాథమిక విద్యా పునాదిలో నాణ్యత లేకపోవడం వల్ల నార్త్ ఇండియన్ టీచర్స్ వచ్చి క్లాసులో బోధించడం వల్ల కమ్యూనికేషన్ గ్యాప్ తీవ్రంగా ఏర్పడింది ఇటువంటి పరిస్థితుల్లో స్థానిక గెస్ట్ ఫ్యాకల్ట్స్ రోల్ చాలా ముఖ్యమైనది. ఈ సందర్భంగా గెస్ట్ టీచర్లందరికీ తక్షణం రెన్యూవల్ చేసి, వారి సేవలను సకాలంలో గుర్తించి స్థిరత్వం కల్పించాలని ప్రభుత్వాన్ని మరోసారి కోరుతున్నాం.

## పెదజడుమూరులో ముగిసిన భూ వివాదం



గూడెం కొత్తవీధి, మే 6 (ప్రభాతవార్త) : మండలంలోని పెదజడు మూరులో గత కొంతకాలంగా సోదరుల మధ్య నెలకొన్న భూవివా దం పరిష్కార దిశగా ముందడుగు పడింది. పిండి లక్ష్మణరావు, పిండి బాలకృష్ణల మధ్య పూర్వీకుల ఆస్తి పంపకా లపై ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు ఆధ్వర్యంలో మండల స్థాయి సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరు పక్షాలు తమ అభిప్రాయాలను అధికారుల ముందు వెల్లడించాయి. పరస్పర అంగీకారంతో భూమిని పంచుకోవడానికి ఇద్దరు సోదరులు సిద్ధమైనట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ వివాదాన్ని శాంతియుతంగా ముగించేందుకు అధికారులు ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఒప్పించారు. సయోధ్య కుదిరిన నేపథ్యంలో, భూమిని అధికారికంగా పంపిణీ చేసేందుకు వచ్చే వారం సర్వే నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, మండల అభివృద్ధి అధికారి రమణ బాబు పాల్గొని ఇరు వర్గాలను సమన్వయం చేశారు.

## శ్రమదానంతో మెచ్చగూడ గ్రామస్థుల వంతెన నిర్మాణం



అరకు రూరల్, మే 6, ప్రభాతవార్త : అల్లూరి సీతారామరాజు జిల్లా లో అధికారుల నిర్లక్ష్యం గిరిజనుల పాలిట శాపంగా మారుతుంది. తరాలు మారు తున్నా.. గిరిజన ప్రాంతాల అభివృద్ధి మాత్రం కానరావడం లేదు. గిరిజన అభివృద్ధి కొరకు ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తున్నప్పటికీ, సమస్యల పరిష్కార విన్నపానికి అధికారులు కనీస స్థాయిలో స్పందించక పోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కా రం కాకపోవడంతో గిరిజనులు శ్రమదానం నిర్వహించి, సొంత నిధులతో మౌలిక సదుపాయా లను కల్పించుకుని, నిర్లక్ష్య అధికారులకు కనువిప్పు కల్పించి, ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తు న్నారు. అరకులోయ మండలం మాడగడ పంచాయతీ పరిధిలో ఉన్న మారుమూలకు గ్రామం మెచ్చగూడ గ్రామమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. గ్రామంలో 18 కుటుంబాలు ఉండగా, సుమా రు వందమంది గిరిజనులు నివసిస్తున్నారు. అయితే మెచ్చగూడ గ్రామంకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఒక్కోసారి ప్రాణాలను కూడా కోల్పోతున్నారు. ముఖ్యంగా రోడ్డు, వాగుపై వంతెన లేకపోవడంతో గ్రామానికి చెందిన గిరిజనులు మృత్యువాత పడుతున్నారు. దీంతో తమ సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను పలుమార్లు మెచ్చగూడ గ్రామస్తులు కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో, విసుగి చెందిన గ్రామస్తులు చివరికి గ్రామంలో సమావేశమై శ్రమదానం తో రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. అలాగే గ్రామస్తులు సొంత నిధులు ఏర్పాటు చేసుకొని సుమారు 12 లక్షల రూపాయల వ్యయంతో గ్రామం ముందు ఉన్న వాగుపై వంతెనను సైతం నిర్మించుకొని ఆదర్శంగా నిలిచారు. ఎవరో వచ్చి తమను ఆదుకుంటారని ఎదురుచూసిన తమకు నిరాశే ఎదురైందని , చివరికి గ్రామంలో వైద్యం అందక గతం లో భార్యా, భర్తలు వేరువేరుగా మృతి చెందారని, అలాగే అప్పుడే పుట్టిన ఓ చిన్నారి ని వైద్య సేవలు కోసం ఆసపత్రికి తీసుకెళ్లే లోపు ప్రాణాలను విడిచిపెట్టిందని దీంతో చేసేది లేక అప్పులు చేసి, ఉన్న కొద్దిపాటి బంగారాన్ని సైతం అమ్ముకొని నిధులను ఏర్పాటు చేసుకొని వాగుపై వంతెనను నిర్మిస్తున్నామని మెచ్చగూడ గ్రామ గిరిజనలు ఆవేదన చెందుతూ పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాము ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా, బీటీ రోడ్డు గానైనా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







**బంగారాలు తాకట్టు పెట్టి మౌలిక సదుపాయాలు:** కల్పించుకుంటున్నాం. మెచ్చగూడ గ్రామానికి రహదారి వంతెన నిర్మాణానికి అధికారులు స్పందించక పోవడంతో గ్రామస్తులు అంతా ఏకమై సొంతంగా విరాళాలు సేకరించుకొని బంగారాలు తాకట్టుపెట్టి నిధులు సమకూర్చుకొని వంతెనలను నిర్మించుకున్నాం.

**కొర్ర గులాబీ, గ్రామ మహిళ**



**అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదు..** గ్రామ సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ, కనీసం స్పం దించలేదు. అధికార నిర్లక్ష్యం వలన గ్రామస్తుల ప్రాణాలు కూడా కోల్పోయాయి.

**పెట్టలి మార్టిన్, మెచ్చగుడ గ్రామస్తుడు.**

## రెవెన్యూ అంశాలపై ఉద్యోగులకు అవగాహన : జేసీ



పాడేరు,మే 6, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా లోని రెవెన్యూ యంత్రాంగం మరింత సమర్థ వంతంగా పనిచేసేలా, పారదర్శకతతో కూడిన సేవలను ప్రజలకు అందించేలా జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ సంబంధిత అధికా రులకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాల యంలో నిర్వహించిన కలెక్టరేట్ కార్యాలయం లోని వివిధ సెక్షన్ల సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీపూజ మాట్లాడుతూ కార్యాలయ పనిదినాల్లో పాటించవలసిన నిబంధనలు, రికార్డుల నిర్వహణపై కీలక ఆదేశాలు జారీ చేశారు.

**శిక్షణలోని ముఖ్యాంశాలు,**

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పి.జి.ఆర్.ఎస్ ఆర్.టి.జి.ఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్ప టికప్పుడు సమీక్షిస్తూ, గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బాధితులకు సంతృప్తికరమైన సేవ లందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రికార్డుల నవీకరణ: రెవెన్యూ రికార్డుల అప్డేషన్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, ప్రతిష్టంగా, ప్రతి ఫైలును క్రమపద్ధతిలో నిర్వహిం చాలని ఆదేశించారు. సిబ్బంది సెలవుల నిర్వహణ, కార్యాలయంలో సి.ఎల్ , ఈ.ఎల్ వంటి సెలవుల రిజిస్టర్లను, సర్వీస్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని, అటెండెన్స్, ఇతర రిజిస్టార్ల మెయింటెనెన్స్ విషయంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ఫైల్స్ పంపిణీ, పర్యవేక్షణ, వివిధ విభాగాల మధ్య ఫైల్స్ పంపిణీ ప్రక్రియ వేగవంతంగా జరగాలని, కార్యాలయ పనివేళల్లో సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. పారదర్శకతతో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎక్కడా జాప్యం జరగకుండా, ప్రజలకు జవాబుదారీతనంతో సేవలు అందించాలని ఆమె అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు మాట్లాడుతూ కార్యాలయపల్లి దినాల్లో ఫైల్స్ పంపిణీ సంబంధిత అధికారుల ద్వారా మాత్రమే పంపిణీ జరగాలని, తప్పనిసరిగా ఈ ఫైలింగ్ విధానం ప్రతి ఒక్కరు నిర్వహించాలని, ఫైల్స్ పై అధికారికి పంపినప్పుడు ముందుగానే ఒకటికి రెండుసార్లు ఫైళ్లను పరిశీలించుకుని ఆ తర్వాత పై అధికారులకు పంపించే మార్గం చూడాలన్నారు. సెలవులు వినియోగించుకోవాలనుకున్నవారు తప్పనిసరిగా ముందుగా సంబంధిత కార్యాలయ అధికారి వారికి తెలియపరచి సెలవులో వెళ్లాలని ఆదేశించారు. తప్పనిసరి అవసరమైతే తప్ప ఫోన్లో మెసేజ్లు పంపించే విధానాన్ని మానుకోవాలని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ఏసి), ఎం వి ఎస్ లోకేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రసాదరావు, కలెక్టరేట్ సూపర్డెంట్ లక్ష్మణరావు, పి జి ఆర్ ఎస్, డిప్యూటీ తాసిల్దార్ పోల్ రాజ్ , వివిధ సెక్షన్ల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వాకం .. పామాయిల్ రైతుకు నష్టం



కొయ్యూరు, మే 6, ప్రభాతవార్త : ముందుగా ఇటువంటి సమాచారం ఇవ్వ కుండా కొయ్యూరు విద్యుత్ శాఖ సిబ్బంది తీసుకున్న ఏకపక్ష నిర్ణయం తమకు తీవ్ర నష్టం కలిగిస్తుందని పామా యిల్ తోట రైతు బొంతు సుబ్రహ్మణ్యేశ్వరరావు కుటుంబం వాపోతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాకరపాడు విద్యుత్ సబ్ స్టేషన్కు పొరుగున గల రాజవొమ్మం గి మండలం నుండి విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే విద్యుత్తు లైన్లకు అంతరాయం కలగకుండా విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్వ హించే జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా రాజవొమ్మంగి మండలం శరభవరం గ్రామానికి చెందిన బొంతు సుబ్రహ్మణ్యేశ్వరరావుకు చెందిన పామాయిల్ తోటలోని సుమారు 22 మొక్కల మట్టలను పరిమితికి మించి మొవ్వుల వరకు ఎటువంటి సమాచారం లేకుండా కాకరపాడు విద్యుత్‌శాఖ సిబ్బంది నరికేసారని, తాము వారిస్తున్నా.. వినలేదని యజమాని రైతు భార్య లక్ష్మీ వాపోయారు. దీనివలన పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయి, ఏడాదికి సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ముందే హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా తాము 78 పామాయిల్ చెట్లను కోల్పోయామని, ఇప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వాకం వలన మరొక 22 చెట్లను కోల్పోవలసి వస్తుందని ఆమె కన్నీరుమున్నీరవుతున్నారు. తమకు నష్టపరిహారం ఇచ్చేవరకు న్యాయ పోరాటాన్ని ఆపేది లేదని, తాము పోలవరం కలెక్టర్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించనున్నట్టు ఆమె తెలిపారు.

## మలేరియా నివారణ చర్యలకు సహకరించాలి



కొయ్యూరు, మే 6, ప్రభాతవార్త : ఏజెన్సీ గ్రామాలలో మలేరియా జ్వరాల నివారణకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన గ్రామాల్లో స్ప్రేయింగ్ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుం దని, ప్రజలు అందుబాటులో ఉండి మలేరియా సిబ్బంది చేపట్టే స్ప్రేయింగ్‌కు సహకరించడం తోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూసు కోవడం. దోమ తెరలు సక్రమంగా ఉపయోగించడం. దోమల నివారణ మందులు వాడటం మొదలైన రక్షణ తప్పని సరిగా పాటించాలని డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ సూచించారు. మండలంలోని దౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా ఉధృతి అధికంగా వున్న గదబపాలెం పంచాయతీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. గ్రామములో స్ప్రేయింగ్ ప్రగతి ,డ్రై డే కార్యక్రమం అమలు , రక్తపూతల సేకరణ సమాచారంతో పాటు మలేరియా బాధితుల వివరాలను పంచాయతీ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బందితో సమీక్షించారు. తక్షణమే దోమతెరల పంపిణి చేపట్టాలని సిబ్బందిని ఆదేశించా రు. వ్యాధి లక్షణాలు కనపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని గ్రామస్థులకు సూచించారు.

## ఆశవర్కర్ వరహాలమ్మను పరామర్శించిన జనసేన నేతలు



డుంబ్రిగూడ, మే 6, ప్రభాతవార్త: ఆశ వర్కర్‌గా విధులు నిర్వహి స్తున్న గుజ్జల వరహాలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయాన్ని తెలుసుకున్న మండల జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోటేశ్వరరావు కొండల రావు నరేష్ బుధవారం ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు పొంది త్వరగా కోలుకోవాలని ఆశ వర్కర్‌గా తన విధులను మరింతగా గిరిజన వ్యాధిగ్రస్తులకు సేవలందించాలని వారు ఆకాంక్షించారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఎస్ఏకు వార్డెన్ బాధ్యతలా?




గూడెంకొత్తవీది, మే 6, (ప్రభాతవార్త) : స్కూల్ అసిస్టెంట్‌కు విధివిధా నాలకు విరుద్ధంగా వార్డెన్ బాధ్యతలు అప్పగించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పై అధికారుల నుంచి ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు లేకుండానే హెచ్ఎం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఇటీవలే గ్రేడ్॥ నుండి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఒక ఉపాధ్యాయునికి, ఆరు నెలలు కూడా పూర్తికాకముందే వార్డెన్ బాధ్యతలు అప్పగించడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాలలో ఎస్జీటీలు, పీడీలు , పీఈటీలు ఉన్నప్పటికీ, వారికి అవకాశం ఇవ్వకుండా ఈ నిర్ణయం తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే పాఠశాలలో పదో తరగతి ఫలితాలు 70 శాతానికి పడిపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సబ్జెక్టు టీచర్లకు అదనంగా వార్డెన్ బాధ్యతలు అప్పగిస్తే, బోధనపై ప్రభావం పడి మిగిలిన ఫలితాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, డిప్యూటీ వార్డెన్ పదవిని కూడా స్కూల్ అసిస్టెంట్ కు అప్పగించడం వెనుక "అనుచిత లావాదేవీలు" జరిగాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పాఠశాల నిర్వహణపై తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## పాడేరు పండుగకు చుట్టాలను రమ్మనాలా... వద్దా ?



**ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అమర్**

పాడేరు,మే 6, ప్రభాతవార్త: అల్లూరి జిల్లాలో గ్యాస్ వినియోగదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ప్రజలను ఆకలితో పస్తులుంచొద్దని ప్రభుత్వాన్ని ఎఐటి యుసి జిల్లా అధ్యక్షులు అమర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు గ్యాస్ దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ మాటల్లో మార్చి నుండి దేశం ఎల్పీజి ఉత్పత్తులు 30 శాతం ఉన్నా యని దేశంలో చమురు కొరత లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదని,రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఎల్. పి జి గ్యాస్‌కు ఇబ్బంది లేదని కొరత లేదు అని చెప్తూనే ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రోజున్నర లో గ్యాస్ సిలెండర్ డెలివరీ ఇవ్వాలని అంటారు.పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజలు భయాందోళన చెందవద్దు తప్పుడు ప్రచారాలు వినవొద్దు అని చెప్తారు. రోజుకు 2 లక్షలకు పైబడి డెలివరీలు అవుతున్నాయని అంటారు.ఇలాంటి మాట లు ప్రజలను మభ్య పెట్టడమే తప్ప మరొకటి కాదని అమర్ అన్నారు. బ్లాక్ మార్కెట్‌ను నియం త్రించాలని ఓటీపీ పద్ధతిని తీసుకురావటం జరిగిందని ఈ కే వై సి తప్పుని సరి చేయటంతో ప్రజలు ఓటీపీలు రాక సాంకేతిక లోపాలు, ఇబ్బందులతో ప్రజలు,చిన్నారి పిల్లలు ఆకలితో పస్తులుంటున్నారని మండిపడ్డారు.బ్లాక్ మార్కెట్ ను నియంత్రించాలంటే నిఘావర్గాలతో వెంటపెట్టుకొని అటువంటి చర్యలకు పాల్పడేవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలేతప్ప ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని ఆయన మండిపడ్డారు. పట్టణ ప్రాంతంలో 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు రిఫిల్ కు అవకాశం తప్ప మధ్యలో గ్యాస్ అయిపోతే బుకింగ్ అవ్వదని ఆదేశాలు ఇవ్వటం సరైన పద్ధతి కాదని అన్నారు.ఒక్కొక కుటుంబం లో 6,7 గురుఉంటారు,అలానే తమ ఇళ్లకు చుట్టాలు వస్తారు అందులోని ప్రస్తుతం వేసవి సెలవులు తమ సొంత గ్రామాలకు వెళ్తుంటారు.అలాంటప్పుడు తక్కువ రోజులకే గ్యాస్ అయిపోతుంది. అలాంటి తరుణంలో గ్యాస్ ఇవ్వకపోతే మరి ఆకలితో ఉండటం తప్ప మరొక మార్గం లేదు.కాబట్టి ఇలాంటి నిర్ణయం ప్రజలను ఇబ్బంది పెట్టడం అవుతుందని అన్నారు.కాల్ సెంటర్ కి కాల్ చేస్తే 4 గంటలు తర్వాత చేయండి అని రోజులు తరబడి కాలం వెళ్ళబుచుతున్నారు తప్ప సమస్య పరిష్కారం అవ్వటం లేదు.బుకింగ్ 45 రోజులు అయిన తరువాత డిఎసి మెసేజ్ రావటానికి మరో 20 నుండి 25 రోజులు పడుతుందని ఇలాంటి తరుణంలో ప్రజలు గ్యాస్ లేక తమతో పాటు వారి పిల్లలను ఆకలికి పస్తులుంచుతున్నారని అమర్‌అన్నారు. ప్రధానంగా పాడేరు పట్టణంలో అయితే ఈ నెలలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఉన్నందున సుదీర్ఘ ప్రాంతాల నుంచి ఒక్కొక్క కుటుంబంలో తమ కుటుంబీకులు పదుల సంఖ్యలో పాడేరు చేరుకుంటారు. ఇలాంటి తరుణంలో గ్యాస్ దొరకక పాడేరు పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు గురవుతూ పాడేరు అమ్మవారి జాతరకు చుట్టాలని రావద్దు అని చెప్పలేక రమ్మని చెప్పే ధైర్యం చేయ లేక అయోమయంలో ఉన్నటువంటి పరిస్థితి నెలకొన్నది. జిల్లాస్థాయి అధికారులు సాంకేతిక లోపాలని కొంచెం సవరించాలని ఈ సమస్య పరిష్కారం అయ్యేవరకు మాన్యువల్ పద్ధతిలో తక్షణమే గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు ఆలస్యం చేయకుండా అందించాలని డిమాండ్ చేశారు. స్పందించి వెంటనే సమస్య పరిష్కారం చేయకపోతే కచ్చితంగా గ్యాస్ సిలిండర్లతో ప్రజల్ని కలుపుకొని ఐటీడీఏ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సిన అవసరం వస్తుందని అమర్ హెచ్చరించారు.

## లంబసింగి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పాడేరు,మే 6, ప్రభాతవార్త: చింతపల్లి మండలం లంబసింగి పర్యటనలో భాగంగా ఐటిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ బుధవారం పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతోపాటు లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని వివిధ విభాగాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద రోగులు వేచి ఉండకుండా త్వరితగతిన సేవలు అందించాలని ఆదేశించారు. మందుల నిల్వ పరిశీలన, ఆసుపత్రిలోని ఫార్మసీని తనిఖీ చేసి, అవస రమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తూ, మందుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది పనితీరు, వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. పేషెంట్లతో ముఖాముఖి, వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యం, ఇతర సదుపాయాలు సిబ్బంది ప్రవర్తన గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణలో ఆసుపత్రికి సంబంధించిన వివిధ రికార్డులు, రిజిస్టర్లను నిశితంగా పరిశీలించి, డేటా నిర్వహణలో పారదర్శకత ఉండాలని ఆదేశించారు.

**మెరుగైన సేవలే లక్ష్యం**

అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పీహెచ్‌సీ పరిధిలో పారిశుధ్యం మెరుగుపరచాలని, అత్యవసర సేవల కోసం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. డాక్టర్ దినేష్ కుమార్, డాక్టర్ వరప్రసాద్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎమ్స్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిని సెన్సస్ (జనగణన) పరిధిలోకి తీసుకురావాలి

**అధికారులకు కలెక్టర్ నిశాంతి ఆదేశం**



పాడేరు,మే6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారుల ఆదేశాలు, డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ వారి ఆదేశాలు మేరకు జిల్లాలో సెన్సస్ (జనగణన) ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అమరావతి నుండి జరిగిన టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా ప్రణాళికా అధికారి మరియు జిల్లా సమాచారం పౌర సంబంధాల అధికారి లతో మాట్లాడి పలు కీలక సూచనలు చేశారు.

**ప్రచారానికి ప్రాధాన్యత:**

సెన్సస్ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వ అధికారులు ఇందుకు కావలసిన తగు చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో టామ్ టామ్: ప్రతి గ్రామంలోనూ దండోరా (టామ్ టామ్) ద్వారా ప్రజలకు సెన్సస్ వివరాలను తెలియజేయాలి. కళాజాత ప్రదర్శనలు వారపు సంతలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో కళాకారుల ద్వారా ఖికళాజాతఖి ప్రదర్శనలు ఇచ్చి అవగాహన కల్పించాలలి తెలిపారు. పోస్టర్లు,కరపత్రాలు, మైకుల ద్వారా ప్రచారం కోసం ఆటోలు, మిని వాహనాలకు మైకులు అమర్చి మండల మరియు గ్రామ స్థాయిల్లో నిరంతరం ప్రచారం చేయాలని తహసిల్దార్లు,మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇతర అధికారులకు జిల్లా రెవిన్యూ అధికారి వారి ద్వారా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారికి సలహాలు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ సెన్సస్‌లో నమోదయ్యేలా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదే" అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎవరూ కూడా ఈ ప్రక్రియ నుండి మినహాయింపు పొందకుండా, పారదర్శకంగా గణన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి (ఎఫ్ఏసి ) ఎంవీఎస్ లోకేశ్వరరావు, సిపిఓ ప్రసాదరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రసాదరావు,డిపిఆర్ఓ (ఎఫ్ఏసి ) వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస, మే 6, ప్రభాతవార్త : యువత చదువుతో పాటు క్రీడ ల్లో రాణించాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ ఛైర్మన్ కూన రవి కుమార్ అన్నారు. బుధవారం టి20 జిల్లా స్థాయి, ఎమ్మెల్యే కప్ 2026 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయ భావన పెరగడానికి క్రీడలో ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి తొలి బంతిని ఆడి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షుడు మొదలవలస రమేష్, తమ్మినేని సుజాత, రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, టోర్నమెంట్ నిర్వాహకుడు తమ్మినేని విద్యాసాగర్, పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళీధర్, ఏజిపి పైడి వరాహ నరసింహులు, నారా ఈశ్వరరావు, కూన ఆంజనేయులు, గోండు రమణమూర్తి, నాగళ్ళ మురళీధర్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగణనను పకడ్బందీగా నిర్వహించండి



వీరఘట్టం, మే 6, ప్రభాతవార్త: జనగణనను పగడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో బి.వెంకట రమణ ఆదేశించారు. బుధవారం మండలంలోని పెద్ద గదబవలస గ్రామపంచాయతీ దువ్వన్నపాడు, శాంతిగూడ ఆవాసాల్లో జరుగుతున్న జనగణనను ఆయన స్వయంగా పరిశీలించారు. ఎక్కడ ఎటువంటి తప్పిదాలు జరగకుండా ఖచ్చితమైన డేటాను సేకరించాలని ఆయన సూచించారు.

## మాజీ వైసీపీ సర్పంచ్‌లకు ఘన సన్మానం



ఇచ్ఛాపురం, మే 6 ప్రభాతవార్త : నియోజకవర్గం వైస్సార్సీపీ ప్రతినిధులైన సర్పంచ్‌లకు పార్టీ తరపున సన్మానం నిర్వహించారు. వైస్సార్సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడిన సమావేశంలో 4 మండలాలకు చెందిన సర్పంచ్‌లకు ఘనంగా సన్మానించారు. సమావేశంలో సాడి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థకు సర్పం చ్‌లే ఆయువుపట్టు అని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రజల సంక్షేమంతో పార్టీ కార్యకర్తలుగా గౌరవం దక్కిందని, ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి వైస్సార్సీపీ సర్పంచ్‌లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అటువంటి ఇబ్బందులను ఉమ్మడిగా ఎదుర్కొందామన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, వైస్సార్సీపీ బి.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతిదివ్య, ఎంపీపీలు పైల దేవదాసు, డా. నిమ్మన దాసు, జడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షులు కడియాల ప్రకాష్, పాతిర్ల రాజశేఖర్, శిలగాన భాస్క రరావు, సర్పంచ్‌లు తడక జోగారావు, పిన్నింటి ఈశ్వరరావు మాట్లాడారు. సోంపేట జడ్పీటీసీ తడక యశోద, వైస్సార్సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, యువ నాయకులు పిలక దేవరాజు, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, వైస్సార్సీపీ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ దక్కత నూకయ్య రెడ్డి, వైస్సార్సీపీ నాయకు లు, ఆశి పురుషోత్తం, ఆశి కృష్ణారెడ్డి, రామపత్ని చిట్టిబాబు, అనపాన శ్రీరామ్ రెడ్డి, దుర్గాసి ధర్మారావు, ఇచ్ఛాపురం పట్టణం, మండలం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



సంతబొమ్మాళి, మే 6 ప్రభాతవార్త : మండలంలోని సంతబొమ్మాళి, దండుగోపాలపురం, నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బుధవారం డిఎం అండ్ హెచ్ ఓ కె.అనిత ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పీహెచ్సీలలో జరుగుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. గర్భిణీలు చిన్నారులకు ఇస్తున్న వ్యాక్సినేషన్, టీకాలు నిల్వలు ఉష్ణోగ్రత నిర్వాహణ, రిజిస్ట్రేషన్ వంటి అంశాలను పరిశీలించారు. పీహెచ్సీలలో నిర్వహణలో ఉన్న రికార్డులను పరిశీలించి అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయా లేదన్న అంశాలపై సిబ్బందితో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ల్యాబ్‌లను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్‌లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 14 ఏళ్ళు నిండిన బాలికలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ మరింత మెరుగుపరచాలని, ఇంకా ఎవరైనా వ్యాక్సినేషన్ తీసుకోని 14 ఏళ్ళు నిండిన అర్హత ఉన్న బాలికలకు వెంటనే పీహెచ్ఈఎల్‌కి తెప్పించి అవగాహన కల్పించి వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. నౌపడ ప్రాథమిక ఆరోగ్య వెనుక పడి ఉన్న వాడిన సూదులు, ఇంజక్షన్‌లు చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సచివాలయాలను ఆమె సందర్శించారు. ఈ తనిఖీలలో సంతబొమ్మాళి, దండు గోపాలపురం, నౌపడ వైద్యులు డాక్టర్ నందిని, డాక్టర్ పల్లవి, డాక్టర్ విశ్వనాథ్ గంగాధర్, డాక్టర్ పరిమళతో పాటు సిబ్బంది ఉన్నారు.

## ఎరువులు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు : ఏవో



ఆమదాలవలస, మే 6 ప్రభాతవార్త : పట్టణ, మండలంలో ఎరువులు అక్రమ నిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి మెట్ట మోహన్‌రావు తెలిపారు. బుధవారం పట్టణంలో శ్రీకృష్ణ ట్రేడింగ్ కంపెనీ, శ్రీ శివ బాలాజీ రైతు డిపో, శ్రీ లక్ష్మీ నారాయణ డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు ఎవరు ముందస్తుగా విత్తనాలు గాని, ఎరువుల గాని, డిఏపి ఎరువులు కొనుగోలు చేయరాద ని తెలిపారు. ఎరువులు అవసరం మేరకే కొనుగోలు చేయాలని కోరారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు తగి నంత ఎరువులు లభ్యతగా ఉన్నాయని తెలిపారు. డీలర్లు ఎవరైనా రైతులకు ఎక్కువ రేట్లకు ఎరువుల అమ్మితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏవో మోహన్ రావు హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు రైతులకు విక్రయించినప్పుడు రసీదు ఇవ్వాలని తెలిపారు. ఎరువుల రికార్డులను, స్టాక్ బోర్డులను పక్కాగా నిర్వ హించాలని షాపు యజమానులకు ఆదేశించారు. ఎరువులను ఎవరైనా అక్రమ నిల్వలు చేస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



సీతంపేట, మే 6 ప్రభాతవార్త : పూతికివలస బనరాయ్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గిరిజనులు తీవ్ర గాయాలు పాలయ్యారు. వీరంతా సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలను ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. డోంబంగివలస బెనరాయ్ రహదారిలో వ్యాన్‌లో 42 మంది గిరిజనులు శుభకార్యానికి వెళ్తుండగా వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఏడుగురికి గాయాలు తగలడంతో వీరంతా సీతంపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో సవర నీలిమ, బిడ్డిక పోలమయి, దమయంతి, గుడిమీ గంగమి, సింగన్న, సుభద్రలకు తీవ్ర గాయాలు తగలడంతో వీరిని శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన వైద్య నిమిత్తం తరలించారు. మిగతా వారికి స్వల్ప గాయాలు తగలడంతో ప్రాథమిక చికిత్స అందించినట్లు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. ఎవరికి ప్రాణాపాయం లేదని తీవ్ర గాయాలు అయిన వారికి చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు.

## కోరమండల్ వారి మన గ్రోమోర్ సెంటర్ నూతన ప్రారంభోత్సవం



సరుబుజ్జిలి, మే 6, ప్రభాతవార్త : మండల కేంద్రంలో బుధవారం ఉదయం కోరమండల్ వారి మన గ్రోమోర్ సెంటర్‌ను జిల్లా డిసిసిబి ఛైర్మన్ శివాల సూర్యనారాయణ, కొత్తూరు ఏడిఓ బొడ్డేపల్లి రాజగోపాలరావు సమక్షంలో నూతనంగా ప్రారంభించారు. మండలంలో రైతుల కు ఎరువులు, పురుగు మందులు దొరకక ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. దానికి అనుగుణంగా కోరమండల్ వారి మన గ్రోమోర్ ఎంతో సహకరిస్తుందని స్థానికులు హర్షం చేశారు. డిసిసిబి ఛైర్మన్ శివాల సూర్యనారాయణ మాట్లాడుతూ మన సరుబుజ్జిలిలో మన గ్రోమోర్ సెంటర్ వల్ల రైతులకు రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, తెగుళ్ళు, పురుగు, కలుపు మొక్కల నివారణకు ముఖ్య కంపెనీల మందులు, నీటిలో కరిగే పోషక ఎరువులు, జీవం అందుబాటులో దొరుకుతాయని, దాంతోపాటు విత్తనాలు పశువుల దాన, తార్పాన్లు మొదలైనవి అందు బాటులో ఉంటాయని, వ్యక్తిగత వాహన ఆరోగ్య బీమా పాలసీలు అన్నీ ఒకే చోట రైతులకు వన్ స్టాప్ సెల్యూషన్ పాయింట్‌గా ఉంటాయని కోరమండల్ శ్రీకాకుళం ఏరియా మేనేజర్, సిబ్బంది తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో పోలమ్మ తల్లి ఉత్సవం



కంచిలి, మే 6 ప్రభాతవార్త : బూరగాంలోని బురగాన పోలమ్మ తల్లి ఆలయం నాల్గవ వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం బోళాలింగేశ్వర భజన బృందం నిర్వహించిన భజనలు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచాయి. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించగా, గ్రామం అంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. కుటుంబ సమేతంగా హాజరైన భక్తులు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దు వెంకటేశ్వరరావు, కన్వీనర్ కప్ప మీనారావు మాట్లాడుతూ భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. బద్రి నాగేశ్వరరావు, మాస్టిల మన్మధరావు, మద్దు తిరుపతిరావు, బుద్ద శ్యాము, బొట్ట తేజేశ్వరరావు, వజ్జల తారకేశ్వరరావు, మద్దు రామరావు, బొద్దు అప్పారావు, మద్దు వెంకటరావు, బొట్ట గంగారావు, దొక్కరి రామరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు బెల్ట్‌షాపు నిర్వాహకులకు బైండోవర్



పాతపట్నం, మే 6 ప్రభాతవార్త : మండలంలోని పాతపట్నం, ప్రహరాజపాలెం, రోమదల, జగ్గిలి బొంతు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న (బెల్ట్ షాపులు) ఐదుగురు వ్యక్తులను బుధవారం పాతపట్నం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (తహశీల్దార్) నందిగాం ప్రసాదరావు ఎదుట బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి, వారిపై 129 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ కింద బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఏడాది కాలం పాటు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడబోమని ఒక్కొక్కరు 2 లక్షల రూపాయల చొప్పున వ్యక్తిగత పూచీకత్తుపై సంతకం చేశారు. ఒకవేళ ఏడాది లోపు మళ్ళీ నిబంధనలు ఉల్లంఘిస్తే, సదరు మొత్తాన్ని జరిమానాగా చెల్లించాల్సి ఉంటుందని కృష్ణారావు హెచ్చరించారు. మండలంలో అక్రమ మద్యం విక్రయాలు జరిపినా, నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## నారీ శక్తి అవగాహన సదస్సు



పలాస, మే 6, ప్రభాతవార్త: కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఎస్సై ఆర్.నరసింహమూర్తి, సిబ్బందితో కలిసి కోసంగిపురం సందర్శించి, గ్రామ జంక్షన్‌లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్‌లు ఏమైనా ఉంటే వాటికి దిది కెమెరాలు అమర్చమని, అదేవిధంగా గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వమని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా , అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయోగం, మొదలైన వాటి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## బీజేపీ విజయం .. పారదర్శక పాలనకు నిదర్శనం : మాధవ్



రణస్థలం, మే 6 ప్రభాతవార్త : ఇటీవల వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన విజయం ప్రధాని నరేంద్ర మోదీ పారదర్శక పాలనకు, ప్రజల అభివృద్ధి పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకు దిటి ఈశ్వరరావు ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకర్ల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, బలమైన నాయకత్వం వల్లే ప్రజలు బీజేపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. పార్టీ సిద్ధాంతాలు, జాతీయత, సేవా భావం వంటి విలువలతోనే భారతీయ జనతా పార్టీ ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. సమావేశంలో కూటమి నేతలు తేజేశ్వరరావు, విశ్వక్ సేన్, చౌదరి బాబ్జీ, డీజీఎం ఆనందరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నప్రసాద కార్యక్రమానికి రూ.10 వేలు విరాళం



పాతపట్నం, మే 6 ప్రభాతవార్త : ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవస్థానంలో అన్నప్రసాద కార్యక్రమానికి దాతలు కలివరపు శ్రీనివాసరావు దంపతులు 10 వేల రూపాయలు విరాళంగా ఆలయ ఛైర్మన్ అక్కంద్ర సన్యాసి రావుకి అందజేశారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కె.సుదర్శనరావు, భక్తులు పాల్గొన్నారు.

## చిన్నారి దీక్షితకు రూ.12 వేలు ఆర్థిక సాయం



సంతబొమ్మాళి, మే 6 ప్రభాతవార్త : టెక్కలి గ్రామానికి చెందిన చిన్నారి దీక్షితకు మండలంలో సీతానగరం గ్రామానికి చెందిన యూత్ ఆఫ్ యూనిటీ వారు మంగళవారం సహకారం అందించారు. దీక్షిత ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకుని చిన్నారి వైద్యం ఖర్చులకోసం సాయం చేసిన స్వచ్ఛంద సంస్థల సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు యూత్ ఆఫ్ యూనిటీ సభ్యులు స్వయంగా రూ.12 వేలు అందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

## గిరిజన గ్రామాల్లో పీవీటీజీ సర్వే

సీతంపేట, మే 6 ప్రభాతవార్త : సీతంపేట ఐటిడిఏ పరిధిలోని 20 మండలాల్లో ఉన్న గిరిజన గ్రామాల్లో పీవీటీజీ సర్వే నిర్వహించడం జరుగుతుందని సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పీవీటీజీ సర్వే చేయడానికి ప్రభుత్వం తరపున ఎన్యూమరేటర్లు గ్రామాలకు వచ్చినప్పుడు వారికి పూర్తి సహకారం అందించాలని అన్నారు. సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లకు స్థానిక ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది సహకరించాలని ఈ సర్వేకు గిరిజన ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి ఎన్యూమరేటర్లు కోరే సమాచారాన్ని అందించాలని ప్రాజెక్ట్ అధికారి ప్రకటనలో కోరారు.

## రాష్ట్ర మీట్‌లో కవిటి యువకుడి ప్రతిభ



కవిటి, మే 6 ప్రభాతవార్త : గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రౌండ్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కవిటికి చెందిన యువ అథ్లెట్ మగులిపురి సతీష్ ప్రతిభ కనబరిచాడు. ఈ పోటీల్లో 10 కిలోమీటర్ల నడక విభాగంలో అద్భుత ప్రదర్శన చేసి తృతీయ స్థానం సాధించి కవిటి మండలానికి గర్వకారణంగా నిలిచాడు. సతీష్ సాధించిన ఈ విజయం పట్ల క్రీడాభిమానులు, గ్రామ పెద్దలు, యువత హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## శ్రీ అభయాంజనేయ విగ్రహావిష్కరణ



ఇచ్ఛాపురం, మే 6 ప్రభాతవార్త: ఈ నెల 8వ తేదీ శుక్రవారం శ్రీశ్రీశ్రీ తారకేశ్వర దేవాలయంలో శ్రీ అభయ అంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ, యంత్ర విగ్రహ ప్రతిష్టా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుంది. కావున భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

## కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస, మే 6, ప్రభాతవార్త : కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారులకు ఆనందం కలుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన స్పౌజ్ 65 పింఛన్లను బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలన్నారు. నియోజవర్గం అభివృద్ధి తన ధ్యేయమన్నారు. ప్రతినెల లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించడంతో వారి ఇళ్లలో ఆనందాన్ని చూస్తున్నామన్నారు. కుటుంబంలో భర్తకు పెన్షన్ వచ్చి ఆ భర్త మరణిస్తే వెంటనే భార్యకు పెన్షన్ బదిలీ చేసే విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. దీనివలన అర్హులైన ప్రతి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల అందేలా కృషి చేస్తుందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, తమ్మినేని సుజాత, ఆనెపు రామకృష్ణ, రాష్ట్రకాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్,మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తమ్మినేని గీత, కె.వి రాజ్యలక్ష్మి, కనితి విజయలక్ష్మి భాయ్, బోయన సునీత, తమ్మినేని అమర్నాథ్, అన్నెపు భాస్కరరావు,గోండు రమణమూర్తి, ఆమదాలవలస ఎంపీడీవో సీపాన రామ్మోహన్ రావు, పొందూరు ఎంపీడీవో వాసుదేవరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హాసినికి ఘన సన్మానం



కంచిలి, మే 6 ప్రభాతవార్త: ఎస్ఎస్‌సి 2025-26 ఫలితాలలో 589 మార్కులు సాధించి కంచిలి మండలంలో ప్రథమ స్థానం దక్కించుకున్న జెడ్పీహెచ్ఎస్ బూరగాం విద్యార్థిని సింహాద్రి హాసినికు కంచిలి మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆమెకు దుశ్శాలువ కప్పి అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్. బాబురావు, జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్, జిల్లా సీపీఎస్ కన్వీనర్ ఎన్.రవి, కంచిలి మండల అధ్యక్షుడు మురళి నాయక్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, సీనియర్ కామ్రేడ్స్ శమళ్ల వెంకటరావు, పురుషోత్తం రెడ్డి, భగవతిరావు, నిరంజన్ ఖడంగా, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ కుమార్తె వివాహ వేడుకలో ఎమ్మెల్యే కోండ్రు



రాజాం, మే 6 ప్రభాతవార్త : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ బుధవారం విశాఖలో రాజాం టౌన్ సీఐ కాటం అశోక్ కుమార్ కుమార్తె డా. లక్ష్మీ అనూహ్య, డా. సిద్ధార్థ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో రాజాం నియోజక వర్గం సీనియర్ తెదేపా నాయకులు కోండ్రు జగదీష్‌తో పాటు, నియోజక వర్గం కూటమి నాయకులు నంది సూర్య ప్రకాశరావు, గురవాణ నారాయణరావు, వంగ వెంకటరావు, పొట్నూరు లక్ష్మణ, దూబ ధర్మారావు, హరి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## రైలు నుంచి జారిపడి యువకుడికి బలమైన గాయాలు



కంచిలి, మే 6 ప్రభాతవార్త : సోంపేట రైల్వే నిలయంలో రైలు నుంచి జారిపడి యువకుడికి బలమైన గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సోంపేట రైల్వే స్టేషన్లో ఆగింది. ఒరిస్సా రాష్ట్రం అంకుల చండిపడ గ్రామానికి చెందిన ప్రభంజన్ నాయక్ సోంపేటలో జరుగుతున్న వివాహ కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా సోంపేటలో రైలు నిలిచిన తర్వాత తన బ్యాగు ఆగి ఉన్న రైలు పట్టాల కింద పడిపోవడంతో తీసుకోబోయి ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి వెంటనే అతనిని అంబులెన్స్‌లో సోంపేట సామాజిక ఆసుపత్రి తరలించి చికిత్సలు అందజేశారు. మెరుగైన చికిత్సల కోసం బరంపురం ఎంకేసి జిహెచ్ ఆసుపత్రికి తరలించారు.

## స్వచ్ఛ నరసన్నపేటే ధ్యేయం : కలెక్టర్



నరసన్నపేట, మే 6 ప్రభాతవార్త : జిల్లాలో ప్రముఖ వాణిజ్య కేంద్రమైన నరసన్నపేటను ఆదర్శవంతమైన 'స్వచ్ఛ నరసన్నపేట'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయమే నరసన్నపేట చేరుకున్న కలెక్టర్, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించారు. పారిశుధ్య నిర్వహణలో రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి లక్ష్యాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని 20 వార్డులకు గానూ ప్రత్యేకంగా ఇన్‌చార్జ్ అధికారులను నియమించారు. వీరిలో 20 మంది ఎంపీడీఓలు, 20 మంది డిప్యూటీ ఎంపీడీఓలు, 50 మంది పంచాయతీ కార్యదర్శులు, 10 మంది తహసీల్దార్లతో పాటు భారీగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనుల కోసం ప్రత్యేకంగా 20 మంది కార్మికులను, ట్రాక్టర్లను కేటాయించి పారిశుధ్య విప్లవానికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ తన పర్యటనలో భాగంగా సత్యవరం కూడలి నుండి పెద్దపేట వరకు కాలినడకన వెళ్లి పారిశుధ్య పనులను పరిశీలించారు.

## రైతులకు రాజముద్ర పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ



పాతపట్నం, మే 6 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని స్థానిక స్వర్ణ గ్రామం1 కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. వెబ్ ల్యాండ్ వివరాలతో కూడిన ఈ కొత్త పాసు పుస్తకాలు రైతులకు పూర్తి భరోసా కల్పించనున్నాయని ఎమ్మెల్యే గోవిందరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపిడిఓ హెచ్.వి రమణమూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, నాయకులు బండి రవివర్మ, అక్కంద్ర సన్యాసిరావు, చిన్నయ్య, కలమట భుజంగరావు, సిర్ల జోగారావు, మండల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు రైతులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## ఎరువులు, విత్తన దుకాణాల్లో ముమ్మర తనిఖీలు



కొత్తూరు, మే 6, ప్రభాతవార్త : రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మండలంలోని ఎరువులు, విత్తనాలు , పురుగుమందుల విక్రయ కేంద్రాలపై వ్యవసాయ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి (క్వాలిటీ కంట్రోల్) బి.సంధ్యారాణి, ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి ఎస్.సుమంత్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. గత కొద్ది రోజుల క్రితం తనిఖీ సమయంలో మూసివేసి ఉన్న మూడు రిటైల్ షాపులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక గుడ్ల రంగనాథం రిటైల్ షాప్, ప్రభావతి ట్రేడర్స్ సహా ఇతర దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఫిజికల్ స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటబొమ్మాళి, మే 6 ప్రభాతవార్త : జర్జంగి నుండి చల్లవానిపేట వైపు వెళ్లే తారు రోడ్డుపై రేగుల పాడు జంక్షన్ దాటిన తరువాత రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా, సూచికలు లేదా హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా ఒక ట్రాక్టర్ నిలిపివేయడంతో ఈ ప్రమాదం జరిగింది. సారవకోట మండలం అలుదుకి చెందిన పొట్నూరు బాలకృష్ణ (38), తండ్రి గోవిందరావు, టెక్కలి మెడ్ ప్లస్ మెడికల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను తన పల్సర్ మోటార్ సైకిల్‌పై టెక్కలి నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డుపై ఆపివున్న ట్రాక్టర్ ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొన్నాడు. తీవ్రంగా ఉండడంతో బాలకృష్ణ రోడ్డుపై పడిపోయి తలకు గట్టి దెబ్బలు గాయం తగిలింది. రక్తస్రావం అధికంగా జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కమల, తల్లిదండ్రులు ఉన్నారు. అయితే వారికి ఇంకా సంతానం లేదు. కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మందుబాబుకి ఐదురోజులు జైలు

వీరఘట్టం, మే 6 ప్రభాతవార్త: వీరఘట్టం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి పట్టుబడ్డ ఒక వ్యక్తికి ఐదు రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ పాలకొండ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సిహెచ్ హరిప్రియ బుధవారం తీర్పు చెప్పినట్లు స్థానిక ఎస్సై షణ్ముఖరావు విలేకరులకు తెలిపారు.

## కాగువాడలో పారిశుధ్య పనులు



పాతపట్నం, మే 6 ప్రభాతవార్త : కాగువాడలో 'స్వచ్ఛ పథం' కార్యక్రమంలో భాగంగా బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని వివిధ వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి ఎస్.పి సమత, నల్లి పైడినాయుడు పాల్గొని పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఈ డ్రైవ్ చేపట్టినట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం సహకరించాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

## డ్రగ్స్‌పై యుద్ధంలో మేము సైతం



రాజాం, మే 6 ప్రభాతవార్త : రాజాం జిఎం ఆర్ ఐ టి డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో, ఈగల్ సెల్ టీం విజయనగరం వారి సహకారంతో విద్యార్థులకు గంజాయి, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన నిర్వహించారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఐజిపి ఆకే రవికృష్ణ, ఎస్పీలు కే.మహేశ్వరరావు కె.నగేష్ బాబు ఆదేశాల మేరకు, ఈగల్ సీఐ డా. టి.కళ్యాణి, ఈగల్ టీం విజయనగరం వారు డ్రగ్స్ దుర్వినియోగంపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో ఈగల్ సీఐ డా టి.కళ్యాణి విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ నార్కో టెర్రరిజం గురించి వివరిస్తూ, మన సరిహద్దు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇతర శత్రుదేశాలు మనదేశంలోనికి అక్రమంగా డ్రగ్స్‌ను సప్లై చేసి యువత భవిష్యత్తును నిర్వీర్యం చేయడమే కాక వాటి ద్వారా వచ్చే డబ్బుతో మరల మనపై దాడి చేసేందుకు ఆయుధాలను, వసతిలను సమకూర్చుకుంటున్నారు కాబట్టి మనమందరం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. వైస్ ఛాన్సలర్ డా జె.గిరీష్, ప్రిన్సిపాల్ డా సిఎల్‌విఆర్‌ఎస్‌వి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డీన్ (సైన్స్ అండ్ టెక్నాలజీ) సిఎల్వి ప్రసాద్, డీన్ ఫిజికల్ సైన్సెస్ డా. ఆర్ఎల్ నాయుడు, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డా. వి.రాంబాబు, ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ డా కె వి ఎస్ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ డా అరుణ్ కుమార్, విజయనగరం ఈగల్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.స్వీటీ, టీం సభ్యులు పాల్గొన్నారు.

## పోలిపల్లి పైడితల్లి ఆదాయం బారెడు.. అభివృద్ధి మూరెడు

రాజాం, మే 6 ప్రభాతవార్త: ఉత్తరాంధ్ర ఇలవేల్పు కొంగు బంగారంగా పిలవబడుతున్న శ్రీ పోలిపల్లి పైడితల్లమ్మ అమ్మవారి దేవాలయం అభివృద్ధికి నోచుకోలేదు.అమ్మవారి ఆదాయం మాత్రం లక్షల్లో వస్తుంది, కానీ ఆలయం అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమే. అమ్మవారికి ప్రతి ఏడాది జాతర జరుగుతుంది. జాతరలో భక్తులకు కనీసం సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయాలని స్థితిలో దేవాలయ ధర్మాదాయ శాఖ అధికారులు చోద్యం చూస్తుంటారు.అమ్మవారికి ప్రసాదాలు, చీరలు, పూజ సామాగ్రి నుంచి టెండర్లు రూపంలో లక్షల్లో ఆదాయం చేకూరుతుంది. అమ్మవారి అభివృద్ధి విషయంలో దాతలు స్పందించి అభివృద్ధి పరుస్తూ వస్తున్నారు తప్ప దేవాదాయ ధర్మ దాయ శాఖ ఇటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగా ప్రకటించి 50 లక్షలు నిధులు మంజూరు చేసింది.ఇంత ఆదాయం వస్తున్న అమ్మవారి గుడి ముందు భాగంలో భక్తులకు సౌకర్యార్థం ఎటువంటి షెడ్ ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఎండలో ఉండే పరిస్థితి నెలకొంటుంది.

## అందరూ కలిసి పనిచేస్తే అభివృద్ధి మనదే : ఎంపీడీవో



బొబ్బిలి, మే 6, ప్రభాతవార్త : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి ఎంపీటీసీలు అందరూ హాజరయ్యారు. హాజరై తమ యొక్క విధులను ప్రజాప్రతినిధులకు తెలియజేశారు ఏవో శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ప్రతి రైతు దగ్గర రేషన్ కార్డు వల్లే ఎరువులు కార్డు ప్రభుత్వం పెట్టిందని అందరూ ఈ కార్డుని వినియోగించుకోవాలని కార్డు ఉంటే రైతుకు సబ్సిడీ మీద ఎరువులు విత్తనాలు విస్తరణ అన్నారు. పిహెచ్ డాక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనికి వెళ్లేవారు. మంచినీరు ఎప్పటికప్పుడు తాగుతూ ఉండాలని గ్లూకోజ్ తదితర ఆనీయాలు సేవించాలని ఎండ తీవ్రత గా ఉంటే కనీసం మైక గుడారాలైన వేసుకోవాలని అన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ ఎక్కడ బోర్లు నీటి సౌకర్యం తక్కువగా ఉందో వెంటనే తెలియజేయాలని అన్నారు. విద్యుత్ ఏయ్ సమావేశం రానందున ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని సమావేశాల్లో విద్యుత్ సమస్యపై ప్రతి గ్రామంలో సమస్యలను సభ్యులు చెప్పి విన్న కూడా వాటి పరిష్కారం లేనందున ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలపై ఫ్లెక్సీలు

పార్వతీపురం, మే6, ప్రభాతవార్త: టూవీలర్ ప్రయాణం అప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ని ధరించాలని, హెల్మెట్ ను బరువుగా భావించకుండా బాధ్యతగా వాడాలని పట్టణ సీఐ వెంకట్రావు అన్నారు. పట్టణం లోని వాణిజ్య సముదాయాల వద్ద ప్రజలకు అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత నియమాల ఫ్లెక్సీలను పట్టణ పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్రావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు, సబ్ డివిజన్ అధికారి ఏఎస్పీ మనీషా రెడ్డి ఉత్తర్వులతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు వద్ద రోడ్డు భద్రత నియమాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలును ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ముఖ్యంగా వాణిజ్య సముదాయాల యజమానులతో సిఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వ్యక్తులు తప్పక హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించే ఫ్లెక్షీలు తమ షాప్ ల వద్ద ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని కోరారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం నివారించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని వంటి ముఖ్య సూచనలు ఈ ఫ్లెక్సీలలో స్పష్టంగా పెట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు.

## స్వచ్ఛ పథంతో రహదారులు సర్వాంగ సుందరం



గరివిడి, మే6, ప్రభాతవార్త: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ పథం కార్యక్రమంతో గ్రామ ప్రవేశ రహదారులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయని గరివిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంవిబి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రతీ బుధవారం నిర్వహించే స్వచ్ఛ పథం కార్యక్రమం కొండపాలెం (గరివిడి) మేజర్ పంచాయతీలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రహదారి కిరువైపులా పేరుకుపోయిన మట్టి,ఇతర వ్యర్థాలను తొలగించి రహదారి రూపు రేఖలను మార్చారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, కొండ పాలెం మేజర్ పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంవిబి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపిడిఓ (పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి) ఎల్. పుష్పాంజలి, కొండ పాలెం కార్యనిర్వాహణాధికారి వేణు గోపాల్ ,టిడిపి నాయకులు సూరప్పడు,పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛపథం.. స్వర్ణగ్రామాలకు ఒక వరం : డీడీవో



చీపురుపల్లి మే 6, ప్రభాతవార్త. స్వచ్ఛ పదం కార్యక్రమం స్వర్ణ గ్రామాలకు ఒక వరం లాంటిదని చీపురుపల్లి డిడిఓ కే హేమ సుందర్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ పదం కార్యక్రమం నిర్వహించారు.పరిశుభ్రమైన గ్రామాలే మన లక్ష్యంగా ప్రతి ఒక్కరం పనిచేయాలి అని పిలుపునిచ్చారు. వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు చేయాలి అని సూచించారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను గుర్తించి, వాటిని తొలగించడంతోపాటు బ్లీచింగ్ జల్లి పారిశుద్ధ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానంగా సేకరించిన వ్యర్థాలను వెంటనే ఎస్ డబ్ల్యు పి సి కేంద్రాలకు లేదా నిర్దేశించిన ప్రాంతాలకు తరలించడం జరుగుతుంది అన్నారు పారిశుద్ధ్య పని ప్రారంభించకముందు, పూర్తి చేసిన తర్వాత తీసిన ఫోటోలను అన్ని గ్రామ పంచాయతీలు పి ఆర్ ఆన్ యాప్ లోనికి స్వచ్ఛ పదం పేరుతో కార్యక్రమం వివరాలను ఫోటోలను విధిగా అప్లోడ్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. చీపురుపల్లి డివిజన్ పరిధిలో గల అన్ని గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమం ప్రతీ బుధవారం నిర్వహించాలని సూచించారు . అదేవిధంగాఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఎంపిడిఓ లు, డిప్యూటీ ఎంపీడీవోలు , పంచాయతీ కార్యదర్శిలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్ రామ్మోహన్రావు, సూపర్ ఈశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరగాలి : సీడీపీవో



చీపురుపల్లి, మే 6, ప్రభాతవార్త : అంగన్వాడీ కేంద్రా ల ప్రతి కిషోర్ బాలికలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కిశోర వికాసం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి సిడిపిఓ పి. నాగమణి కోరారు. బుధవారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని జి అగ్రహారంలో గల మూడు అంగన్వాడీ కేంద్రాలలో కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిసారిగా ఒకరిని ఒకరు తెలుసుకోవడం బాలబాలికల సంఘాలు లక్ష్యంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా జీవన నైపుణ్యాలు శ్రియ అవగాహన ఆరోగ్యమేల తదితర అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. చట్టాలపై అవగాహన హెచ్ఐవి గురించి అవగాహన సమాజంలో పిల్లలు ఎదుర్కొనే వ్యక్తిగత సామూహిక అవసరాలు సవాళ్లు ఎదుర్కొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అదే విధముగా శారీరక వ్యాయామం విద్య మరియు భవిష్యత్తు మార్గదర్శకాల కొరకు కిషోర్ బాలికలకు వివరించాలన్నారు. ప్రధానంగా బాల్యవివాహాలు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పి శశికళ జి .హగ్రహారం పరిధిలో గల అంగనవాడి టీచర్లు డి అప్పలకొండ, కే రాము, ఏ లక్ష్మి.. పలువురు కిశోర బాలికలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ నిత్యవసర ధరలు తగ్గించాలి

పాచిపెంట, మే 6 ప్రభాతవార్త : పెంచిన ఎల్పిజి గ్యాస్ ధరలు వెంటనే తక్షణమే ఉపసంహరించుకోవాలనిసిపిఎం జిల్లా కమిటీ నాయకులు కోరాడ ఈశ్వర్రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నిత్యవసర వస్తువుల్లో ఎల్పిజి గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం వలన సామాన్యులకు ఇది మరింత భారం అని సిపిఎం జిల్లా నాయకులుకోరాడ ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలో బట్నాయకునివలస సెంటర్ వద్ద పత్రిక విలేకరులతో మాట్లాడుతూ నిత్యాల్సరాల ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ పెంపు, గ్యాస్ సిలిండర్ల ధరలు కారణంగా వేలాదిమంది కార్మికులు ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు గ్యాస్ కొరత వలన కష్టాలు ఎదుర్కొంటున్నారని ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కమర్షియల్ సిలిండర్ల ధరలు దాదాపు 1000 రూపాయలు పెంచడం అనేది గతంలో ఎన్నడూ లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా పేదలకు అండగా పాలకులు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు సుర్రు జగదీష్ పాల్గొన్నారు.



## ఉపాధి కూలీలు వడదెబ్బలకు గురి కాకూడదు : జడ్పీ చైర్మన్

చీపురుపల్లి, మే 6, ప్రభాతవార్త : వేసవికాలం ఎండల దృశ్య ఉపాధి హామీ కూలీలు ఎటువంటి వడదెబ్బలకు గురికాకుండా ఉపాధి హామీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారుల నుండి సమస్యలను అడిగి తెలుసుకుని ప్రజాప్రతినిధుల సమక్షంలో పరిష్కార మార్గాలు చూపారు.. ప్రత్యేకించి ఉపాధి హామీ కూలీలకు హాజరు వేస్తున్న నేపథ్యంలో సర్వర్లు పనిచేయక కాలయాపన జరుగుతుందని ప్రత్యమ్యాయంగా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ పీఓకు ఆయన సూచించారు. అదేవిధంగా తాగునీటి సంబంధించి ఆర్డబ్ల్యూఎస్, సంకిలి ప్రాజెక్ట్ అధికారులు గ్రామాల వారీగా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఇటీవల కాలంలో మేజర్ పంచాయతీ పరిధిలోనే నీటి సరఫరా హస్తవ్యస్తంగా జరుగుతున్న పట్ల జడ్పీ చైర్మన్ ఆరా తీశారు. రెండేసి రోజులు నీటి సరఫరా నిలిచిపోతే ప్రజలు త్రాగునీటి ఇబ్బందులు పడతారని భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆయన సూచించారు. అదేవిధంగా ఆర్ అండ్ బి అధికారులు కూడా ప్రధాన రహదారుల్లో అవసరం లేని చోట ఏర్పాటు చేస్తున్న స్పీడు బ్రేకర్లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, స్పీడ్ బ్రేకర్లు ఉన్నచోట రాత్రి వేళల్లో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకుముందు మండల పరిషత్ అధ్యక్షురాలు ఇప్పిలి వెంకట నరసమ్మ అధ్యక్షతన జరిగిన సభలో కర్లాం పిహెచ్సి అధికారిని నివేదిక సమర్పించిన అనంతరం ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ ముందస్తు క్యాన్సర్ నివారణ కొరకు ఇంటింటికి పర్యటించి మందులు అందజేస్తున్నామంటూ పీహెచ్సీ అధికారిని నివేదికను ఆమె ప్రశ్నించారు. గ్రామాల్లో గాని చీపురుపల్లి పట్టణ పరిధిలో గాని వైద్య సిబ్బంది సక్రమంగా సర్వే జరపడం లేదంటూ తమ దృష్టికి వచ్చిందన్నారు. మూకుమ్మడిగా 104 వాహనం వద్దకు ప్రజలను రప్పించి అక్కడే మందులు ఇచ్చి వైద్య సిబ్బంది చేతులు దులుపుకుం టున్నారంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారులు సిబ్బంది పనితీరుని పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా నిమ్మలవలస ఎంపీటీసీ అధికారుల శ్రీనివాసరావు పలువు అధికారుల పనితీరును ప్రశ్నించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన 2400 రూపాయలు ఏ ఒక్క రైతుకు ప్రభుత్వం అందజేయలేదని దిక్కుతోచని పరిస్థితుల్లో 1500 కు 1700లకు దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా త్రాగునీటికి సంబంధించి గ్రామాలలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకుల నుండి నీటి సరఫరా జరుగుతుండడంతో ప్రస్తుతం జనాభా పెరగడంతో జనాలకు త్రాగునీరు సరిపోవడం లేదంటూ అధికారులు నిలదీశారు. ఉపాధి హామీ కూలీలకు త్రాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, నీడనిచ్చే టెంట్లు ఏర్పాటు చేయాలని, విద్యా శాఖకు సంబంధించి నాగం పేట పాఠశాల ప్రహరీ గోడ పడిపోయి ఏళ్ల గడుస్తున్నప్పటికీ ఇంతవరకు నిర్మించలేదని ఎంపీటీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## ఐవోబీ మేనేజర్గా సౌజన్య లహరిక

బొబ్బిలి , మే 6 ప్రభాతవా ర్త : ఐ.ఓ.బి బొబ్బిలి బ్రాంచ్ మేనేజరుగా బుధవారం సౌజన్య లహరిక భాధ్యతలు స్వీకరించారు. భ్యాంకు కాతాదారుల సౌలబ్యమే మాకు ప్రధాన కర్తవ్యమని, అన్ని రకాల గోల్డులోన్లు సంబందించి అర్ధ గంటలోపే కాతాదారులకు లోను జమ చేయడం జరుగుతుందని ఆమి తెలియజేసారు. బ్రాంచి సిబ్బంది పాండ్రంకి నారాయణ రావు, చేప సూర్యకుమారి, జ్యాతి, శ్రీనివాస రావులు మేనేజర్కి అభినందనలు తెలియజేసారు.

## ప్రతి గ్రామంలో విద్యుత్ వెలుగులతో కళకళలాడాలి : ఎమ్మెల్యే



శృంగవరపుకోట,మే6, ప్రభాతవార్త ప్రతీ గ్రామం విద్యుత్ వెలుగులుతో కళకళలాడాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని ఆలుగుబిల్లి గ్రామం నుండి జాగరపు వారి కల్లాల వరకు నెలకొన్న చీకటి సమస్యను పరిష్కరిస్తూ నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు.సుమారు రూ.3లక్షల పంచాయతీ నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపట్టారు. ఈమార్గంలో మొత్తం 20 ఎలక్ట్రికల్ స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లను అమర్చారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలను తీర్చడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించే వరకు విశ్రమించనని పేర్కొన్నారు.తమ సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్,మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు దొకుల చిన్న అచ్చెన్నాయుడు,స్థానిక నాయకులు, విద్యుత్ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిత కఠిన చర్యలు : ఎస్ఐ



పాచి పెంట మే 6 ప్రభాత వార్త : వాహనదారులు ప్రతి ఒక్కరు విధిగా నిబంధనలు పాటించాలని, లేనియెడల వారిపై కఠిన చర్యలు తప్పవని పాచిపెంట ఎస్సై ఎల్. అర్జున్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాహనాలు నడిపిన ప్రతి ఒక్కరు నిబంధనలను విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాలు గురు కావద్దని ఎస్సై వాహన దారులకు హితవు పలికారు. పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ సాలురు కోర్టు తీర్పు వెల్లడించినట్లు ఆయన తెలిపారు. వాహనదారులందరూ ఈ తీర్పును గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎంతటి వారైనా మద్యం సేవించి వాహనాలు నడిపి తనిఖీల్లో దొరికినట్లయితే వారిపై చట్టరీత్యా కేసులు పెట్టి జైలు శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## గిరిజనుల హక్కు కాపాడటం మా బాధ్యత : మంత్రి

సాలూరు, మే6, ప్రభాతవార్త : ఈ మధ్య జనగణన లెక్కలకు సహకరించలేదని ఆరోపిస్తూ కోటియా గ్రూప్ ఆఫ్ విలేజ్లోని ఎగువసింబి గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజనులను అన్యాయంగా ఒడిశా పోలీసులు అరెస్టు చేయడంతో మంత్రి గుమ్మిడి. సంధ్యారాణి స్పందించారు.అలాగే ఈ ఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని బరోసా కల్పించారు.దీంతో కొటియా గ్రామాల గిరిజనులు బుధవారం మంత్రి సంధ్యారాణి క్యాంప్ కార్యాలయానికి వచ్చి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతేకాకుండా బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేసారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతు కొటియా గ్రామాల గిరిజనుల హక్కులను కాపాడటంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అది మా భాద్యత అని స్పష్టం చేసారు.టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ చిట్టి,సత్యం,కొటియా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

## గృహాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్



మెరకముడిదాం,,మే6 ప్రభాతవార్త : మెరకముడిదాం పి.హెచ్. సి పరిధిలో నారపుదొర వలస, సీతారామ పురం గ్రామాల్లో మొదటి విడత గా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులు వ్యాపింప చేసే దోమల నివారణ కొరకు ఐ ఆర్ ఎస్ ( ఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రేయింగ్ ) ఎ సీఎం 5 ద్రావణం ను తేది.06.05.2026 న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది స్ప్రేయింగ్ చేశారు . ఆయా గ్రామాల్లో మొత్తం 34 గృహాలలో స్ప్రేయింగ్ నిర్వహించడ మైనది. రెండవ విడత స్ప్రేయింగ్ జూలై నెలలో నిర్వహించ బడునని తెలియ జేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.అజిత్ బాబు,జిల్లా మలేరియా అధికారి డి. సింహాచలం, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సి .హెచ్. ఓ. రామారావు, సూపర్ వైజర్ వెంకటాద్రి, జయ వర్మ ,ఆశ కార్య కర్తలు పాల్గొన్నారు.

## శుభకార్యానికి హాజరైన మంత్రి సంధ్యారాణి



పాచిపెంట, మే 6, ప్రభాతవార్త : మండల కేంద్రమైన పాచిపెంట ఎంపీటీసీ సభ్యులు పల్లెడ ఉమామహేశ్వరరావు సోదరుడు వివాహం ముహూర్తపు రాటకు బుధవారం ఉదయం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మరియు మండల పార్టీ అధ్యక్షులు ఎవరు పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. సందర్భంగా పెండ్లికొడుకు మంత్రి ఆశీర్వాదాలు అందించారు. ఈమె వెంట ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ పార్టీ అధ్యక్షులు యుగంధర్ పట్టణ టిడిపి అధ్యక్షులు చిట్టి సాలూరు రూరల్ అధ్యకరూరల్ ఆముదాల పరమేశ్వరరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బలరాం ఏఎంసి డైరెక్టర్ పి నర్సింగరావు, మెహర్ బాబా మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం : ఎమ్మెల్యే నాగమాధవి



భోగాపురం, మే 6(ప్రభాత వార్త) : పేద ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఉపాధి శ్రామికులతో మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పూసపాటిరేగ మండలంలోని గోవిందపురం, ఎల్.పి.పురం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే నాగ మాధవి క్షేత్రస్థాయిలో పర్యటించి, ఉపాధి శ్రామికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా వారి వేతనాలు, పని దినాలు మరియు పని పదేశంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళ శ్రామికుల సమస్యలను సావధానంగా విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఉపాధి హామీ పథకానికి నూతన జవజీవాలు వచ్చాయన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపోతం చేయడంలో ఆయన చొరవ అమోఘమన్నారు. శ్రామికులకు గౌరవప్రదమైన బ్రతుకును అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ శ్రామికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు మరియు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే నియోజకవర్గంలో చేపడుతున్న సీసీ రోడ్లు, తాగునీరు పైప్ లైన్ మరమ్మత్తులు వంటి అభివృద్ధి పనులను ఆమె శ్రామికులకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోట్ల రఘు, బాలరాజు (సర్పంచులు), ఉపాధి హామీ శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.27 కోట్లతో ఎయిర్పోర్టు అవుట్లెట్ డ్రైయిన్ల పునరుద్ధరణ

### - ఎమ్మెల్యే లోకం నాగమాధవి



భోగాపురం, మే 6, (ప్రభాతవార్త): నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వం ముఖ్యంగా సాగునీటి రంగానికి పెద్దపీట వేస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పేర్కొన్నారు. భోగాపురం మండలంలోని రాళ్లపాలెం మరియు దల్లిపేట గ్రామాల్లో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఎయిర్పోర్ట్ అవుట్ లెట్ డ్రైయిన్ల పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే బుధవారం భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నుంచి వచ్చే భారీ నీటి ప్రవాహం వలన స్థానిక గ్రామాలకు, పంట పొలాలకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు గాను సుమారు రూ.27 కోట్లతో ఈ అవుట్లెట్ డ్రైయిన్ల పునరుద్ధరణ పనులను డిజైన్ చేసి చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ డ్రైయిన్ల పునరుద్ధరణ పనుల ద్వారా నీటి మళ్లింపు సజావుగా సాగి రాళ్లపాలెం, దల్లి పేట పరిసర ప్రాంతాల్లో సాగునీటి వ్యవస్థ మరింత ప్రతిష్ట కానుందన్నారు. ఈ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణంతో పాటు గ్రామాల మౌలిక సదుపాయాల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఈ డ్రైయిన్ల పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరలోనే పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వందనాల రమణ, మట్ట అయ్యప్ప రామకృష్ణారెడ్డి, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్, కొండపు వెంకటరమణ, ఎమ్మార్వో హరి, ఇరిగేషన్ ఏఈ బాలు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ అండ కోకి మతిభ్రమించింది : మంత్రి

సాలూరు ,మే6, ప్రభాతవార్త : ఈమధ్య జరిగిన విలేకరి దాడి పై మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ఇంకా వైసీపీ అండ్ కో ఇది టీడీపీ కుట్ర అని అలాగే మంత్రి చేసిందని అనే తప్పుడు వ్యాఖ్యలు పై సంధ్యారాణి మండిపడ్డారు.ఆమె బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్మీట్లో మాట్లాడుతు పాత్రికేయలందరు నాకు సహకారం అందిస్తారని కానీ ఒక్క పత్రిక,చానల్ మాత్రం నాపై ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు వక్రీకరించి పత్రికలో రాయడం,చానల్ చూపెట్టడంతో నా ప్రోగ్రామ్స్ కు రావద్దని చెప్పడం జరిగిందని కొత్తవలసలో జరిగిన సంఘటన గుర్తుచేశారు.అలాగే విలేకరి దాడి జరిగిన తర్వాత హస్పెటల్ కు వెళ్లి పరామర్శించిన డిప్యూటీ సీఎం, జడ్పీ చైర్మన్ ఇది కూటమి ప్రభుత్వంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అలాగే విలేకరులపై దాడులు చేస్తున్నారని మతిభ్రమించి మాట్లాడరని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా గతంలో మీ వైసీపీ గవర్నమెంట్ లోనే విలేకరులపై దాడులు ఇంకా కేసులు పెడతామని వార్నింగ్ లు ఇవ్వడం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అలాగే డిప్యూటీ సీఎం ఇంకా వైసీపీ అండ్ కో నాయకుల సంప్రదాయని సుద్దపూసని మాటలు ఎవరు నమ్మరని అందుకే ప్రజలు మీకు 11 సీట్లుఇచ్చి బాగా బుద్ధి చెప్పారని మంత్రి సంధ్యారాణి క్లారిటీ ఇచ్చారు. టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ చిట్టి, పరమేష్,గుల్లా వేణు,ముఖి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పైడిమారమ్మ అనుపోత్సవం



కురుపాం, మే 6ప్రభాతవార్త : కురుపాం మేజర్ పంచాయతీ గ్రామదేవత శ్రీ పైడిమారమ్మ నూతన ఆలయ ప్రతిష్టానంతర మొదటి సంబరాలు (పండుగ) మంగళవారం ,బుధవారం వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి వేషాలు , ఎన్.కె.ఆర్ నృత్యాలయ విశాఖ , చిన్నారులతో కూచిపూడి ,రేలారే రఘు జానపద పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించా యి. బుధవారం ఉదయం చేపట్టిన శ్రీ పైడిమారమ్మ అనుపోత్స వంలో వేలాదిగా ప్రజలు పాల్గొని ,సాంప్రదాయ నృత్యాలుతో ఆనందోత్సా హాలతో ఘనంగా నిర్వహించారు. పలు రంగాల్లో సేవలు అందించిన వారికి యువరాజ వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్ ఐ పి.నారాయణ రావు ఆధ్వర్యంలో ఏ విధమైన అవాంతరాలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రోడ్డు భద్రతా నియమాలపై ఫ్లెక్సీలు



పార్వతీపురం, మే6, ప్రభాతవార్త: టూవీలర్ ప్రయాణం అప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ని ధరించాలని, హెల్మెట్ ను బరువుగా భావించకుండా బాధ్యతగా వాడాలని పట్టణ సీఐ వెంకట్రావు అన్నారు. పట్టణంలోని వాణిజ్య సముదాయాల వద్ద ప్రజలకు అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత నియమాల ఫ్లెక్సీలను పట్టణ పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్రావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు, సబ్ డివిజన్ అధికారి ఏఎస్పీ మనీషా రెడ్డి ఉత్తర్వులతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు వద్ద రోడ్డు భద్రత నియమాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలును ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ముఖ్యంగా వాణిజ్య సముదాయాల యజమానులతో సిఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వ్యక్తులు తప్పక హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించే ఫ్లెక్షీలు తమ షాప్ ల వద్ద ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని కోరారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం నివారించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని వంటి ముఖ్య సూచనలు ఈ ఫ్లెక్సీలలో స్పష్టంగా పెట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు.

## రోడ్డుభద్రతపై వాహనదారులకు అవగాహన



కురుపాం, మే4 ప్రభాతవార్త : కురుపాం మండలంలో గల కురుపాం పంచాయతీ పుతిక వలసలో వాహనదారులకు రోడ్డు భద్రతపై ఎల్విన్పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ హరి, కురుపాం ఎస్ఐ పి .నారాయణరావు, ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవ్నార పుతికవలస లో వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని లేని యెడల ప్రాణానికే ముప్పె అని సి ఐ హరి ప్రజలకు అవగాహన కల్పించారు . అలాగే మహిళా భద్రతపై, ఇటీవల సైబర్ నేరాలు పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్స్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

